హైదరాబాద్ వార్త



# ఉప్పల్ క్రికెట్ స్టేడియం వద్ద వన్డే క్రికెట్ సందడి






హైదరాబాద్, అక్టోబరు 6 ప్రభాతవార్త : ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జా తీయ క్రికెట్ స్టేడియంలో జరిగే ఐసిసి ప్రపంచకప్ -2023 క్రికెట్ మ్యాచ్ సందడి నెలకొంది. శుక్రవారం నెదర్లాండ్స్, పాకిస్తాన్ జట్ల మధ్య వన్డే మ్యాచ్ జరుగుతుండడంతో ప్రేక్షకులు తరలివచ్చారు. రాచకొండ సిపి డిఎస్ చౌహాన్ ఆధ్వర్యంలో స్టేడియం వద్ద గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. ఉప్పల్ స్టేడియంలో ఈనెల 6వ తేది నుంచి పదో తేది వరకు క్రికెట్ క్రీడలు జరుగుతున్నాయని, స్టేడియంలో సుమారు 39వేల కెపాసిటి ఉందని తెలిపారు. అందుకు అనుగుణంగా 1200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. కాగా మధ్యాహ్నం 12 గంటల నుంచే ప్రేక్షకులకు స్టేడియంలోకి అనుమతించారు. మ్యాచ్‌లు సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. . స్థానిక పోలీసులతోపాటు, ట్రాఫిక్, టిఎస్ఎస్‌పి, ఎఆర్ ఫోర్స్, ఎస్‌ఓటి, సిసిఎస్, షీటీమ్, మౌంటెండ్ పోలీసులు బందోబస్తులో నియమించారు. వీరితో పాటు ఫైర్‌సేఫ్టీ, ఇతర అధికారులు ఉన్నారు. స్టేడియం చుట్టూ ప్రక్కల వాహన తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అన్ని పార్కింగ్ స్థలాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు సిపి తెలిపారు. కమాండ్ కంట్రోల్ నుంచి నిఘా ఉంటుందని, స్టేడియంలో ప్రతి ఒక్కరిని గమనిస్తామని తెలిపారు. బిడి టీమ్‌ల సహాయంతో గస్తీ ఉంటుందని, తణక్షమే స్పందించేందుకు కమ్యూనికేషన్ సదుపాయం ఉందన్నారు. స్టేడియం ఏంట్రీ పాయింట్‌ల వద్ద ప్రత్యేకంగా తనిఖీలు చేస్తామని, అసాంఘిక శక్తుల కదలికలు గమనిస్తామని తెలిపారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారిపై నిఘా ఉంచుతామని, మధ్యాహ్నం 12 గంటల నుంచే ప్రేక్షకులకు స్టేడియంలోకి అనుమతించారు.



## నాగరాజు హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదు

**మతాంతర వివాహం చేసుకున్నందుకు నడిరోడ్డుపై హత్య**

ఎల్.బి.నగర్, అక్టోబర్ 6 ప్రభాతవార్త: రంగారెడ్డి కోర్టు సంచలన తీర్పునిచ్చింది. రోడ్డులో హత్య చేసిన కేసులో నిందితులకు రంగారెడ్డి జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధి సరూర్‌నగర్ డివిజన్లో సంచలనం సృష్టించిన బిల్లాపురం నాగరాజు(25) హత్య కేసులో రంగారెడ్డి కోర్టు తీర్పును శుక్రవారం సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్లో ఎల్బీనగర్ డిసిపి సాయిశ్రీ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించింది. ఆశీన్‌సుల్తానా, నాగరాజు ఐదేళ్లుగా ప్రేమించుకుని పెళ్ళి చేసుకున్నారని మతాంతర వివాహం చేసుకున్నాడనే కారణంతో గత ఏడాది మే 4న సరూర్‌నగర్‌లో నడిరోడ్డుపై యువతి సోదరుడు బాలానగర్ కు చెందిన పండ్ల వ్యాపారం చేసే ఏ1 సయ్యద్ మోబిన్‌అహమ్మద్, శేర్లింగంపల్లికి చెందిన కార్ మెకానిక్ ఏ2 మహమ్మద్ మసూద్‌అహ్మద్(అమ్మాయి బావ)లకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు 3000 రూపాయలు కోర్టు ఫైన్ వేయడం జరిగిందని తెలిపారు. మతాంతర వివాహం చేసుకున్నాడనే కారణంతో నడిరోడ్డుపై హత్య చేసిన యువతి సోదరుడుని పోలీసులు 120బి, 341, 302, రెడ్ విత్ 34, ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. ఈ మేరకు పోలీసులు విచారణ చేసిన అనంతరం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి తమ తుది తీర్పును పోలీసులు వివరించారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారానే ఈ కేసును త్వరగా పూర్తి చేయగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఏసిపి జానకిరెడ్డి, ఏసిపి శ్రీధర్‌రెడ్డి, సిఐ శ్రీనివాస్, సబ్‌ఇన్స్పెక్టర్‌లు లక్ష్మణ్‌యాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దుతాం

**అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్**



అడ్డగుట్టలో సిఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

అడ్డగుట్ట, అక్టోబర్ 6 ప్రభాతవార్త: పేద విద్యార్థులకు బాసటగా నిలిచి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ తెలిపారు. శుక్రవారం అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సిఎం అల్పాహార పథకాన్ని అడ్డగుట్ట కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు అందించిన బ్రేక్ ఫాస్ట్‌ను డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ విద్యార్థులకు వడ్డించి వారితో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఒక్కొక్క రోజు ఒక్కో రకమైన మెనును అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సుధాంసు, ఇంజనీర్ ఆశా లత, హెడ్ మాస్టర్ మధుసూదన్ రెడ్డి, గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, బిఆర్ఎస్ నాయకులు శంకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం బ్రేక్ ఫాస్ట్ ప్రారంభం



శ్రీరామ్‌నగర్‌లో బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులకు వడ్డించి, వారితో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్

ఫిల్మ్‌నగర్, అక్టోబర్ 6, ప్రభాతవార్త : జూబ్లీహిల్స్ నియోజక వర్గం రహమత్‌నగర్ డివిజన్‌లోని శ్రీరామ్ నగర్‌లో ప్రభుత్వ పాఠశాలలో సీఎం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని శుక్రవారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాగంటి గోపినాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజలకే కాదు విద్యార్థులకు కూడా ప్రాముఖ్యత ఇస్తున్నారని అన్నారు. ప్రతి పేద విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో రూపాయి ఖర్చులేకుండా చదువుకునే విధంగా, ప్రైవేట్ పాఠశాలలకు మించి ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నీ వసతులను కల్పిస్తున్నారని అన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం విద్యార్థులకు అల్పహారాన్ని వడ్డించి, బ్రేక్ ఫాస్ట్ ఆరగించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పోరేటర్ సీఎన్‌రెడ్డి, డివిజన్ డైరెక్టర్ సంజీవ, డివిజన్ నాయకులు నజీర్, విద్యార్థుల తల్లిదండ్రులు, బిఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## దివ్య కళామేళా ప్రారంభం



పికెట్ గ్రౌండ్‌లో దివ్య కళామేళను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి బౌమిక్ తదితరులు

కంటోన్మెంట్, అక్టోబర్ 6 ప్రభాతవార్త: ప్రపంచ సెరిబ్రల్ పాల్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ పికెట్ జెబిఎస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన దివ్య కళా మేళాను కేంద్ర సామాజిక న్యాయ సాధికారత శాఖ మంత్రి ప్రతిమ బౌమిక్ అవిష్కరించారు. వివిధ రకాల చేతి వృత్తులతో తయారు చేసిన బ్యాగ్‌లు, అల్లికలు, ఎం బ్రైడరీ బ్యాగ్‌ల్లో ఎంతో నాణ్యత ఉందన్నారు. ఈ ప్రదర్శన ఈ నెల 15వ తేదీ వరకు కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌తో పాటు వివకలాంగుల ఉత్పత్తులు, నైపుణ్యాలను మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 6, ప్రభాతవార్త : గత కొంతకాలంగా కూకట్‌పల్లిలో పనిచేస్తున్న కాంట్రాక్టర్లకు సంబంధించి పెండింగు బిల్లులు బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ శుక్రవారం కూకట్‌పల్లి జిహెచ్ఎంసి కార్యాలయం ముందు కాంట్రాక్టర్లు మహాధర్నా నిర్వహించారు. కూకట్‌పల్లి జంట సర్కిల్ పరిధిలో జనవరి నుండి ఇప్పటివరకు దాదాపు 1000 కోట్ల వరకు కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించాల్సి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బకాయిలను వెంటనే రిలీజ్ చేయాలని లేని పక్షంలో కాంట్రాక్టర్లు ఎవరు పని చేయరని వారు హెచ్చరించారు. నో పేమెంట్ నో వర్క్ నినాదంతో జరుగుతున్న ఈ మహాధర్నా కార్యక్రమంలో కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్‌సింగ్ ఇతర కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వేతనాల పెంపుకోసం ఆశా వర్కర్ల రాస్తారోకో



ఆశా వర్కర్లును అరెస్టు చేస్తున్న మహిళా పోలీసులు

సైఫాబాద్, అక్టోబరు 6 ప్రభాతవార్త: తమ డిమాండ్ల సాధన కోసం గత 12 రోజులుగా విధులను బహిష్కరించి నిరవధికంగా సమ్మె చేస్తున్న వందలాది మంది అశా వర్కర్లు శుక్రవారం ట్యాంక్ బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించడంతో పోలీసులు బల వంతంగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్‌కు తీవ్రంగా అంతరాయం ఏర్పడి, కొంత సేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్, సౌత్ కమిటీల ఆధ్వర్యంలో ఈ రాస్తారోకో కార్యక్రమం జరిగింది. తొలుత యూనియన్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.విజయలక్ష్మి, సిఐటియు నగర కార్యదర్శి ఎం.వెంకటేష్, సౌత్ సిటి కమిటీ అధ్యక్షురాలు ఎం.మీనా తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం ఆశా వర్కర్స్‌పై చేస్తున్న దుష్ప్రచారాన్ని తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ఆశా వర్కర్స్‌కు 9,750 రూపాయలు పారితోషకం చెల్లిస్తున్నామని మంత్రుల, గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. హార్యానా రాష్ట్రంలో 14 వేల రూపాయలు, పొరుగున ఉన్న ఆంధ్ర ప్రదేశ్‌లో 10 వేల రూపాయలు చెల్లిస్తున్నారని, దీనికి ఎం సమాధానం చెపుతారని ప్రశ్నించారు. దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకోని విధంగా మన సిఎం కెసిఆర్ 4లక్షల 10 వేల రూపాయలు నెలకు వేతనం తీసుకుంటున్నారని ఏ రాష్ట్రంలో ఇంత వేతనం ఏ ముఖ్యమంత్రి తీసుకోవడం లేదన్నారు. అబద్ధపు ప్రచారాలు మానుకుని వర్కర్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని, లేని పక్షంలో రాష్ట్రంలోని 28 వేల మంది అశా వర్కర్లు 'చలో హైదరాబాద్' ఆందోళన కార్యక్రమాన్ని చేపడతామని వారు హెచ్చరించారు.

## ఆకట్టుకుంటున్న తెలంగాణ ఆర్ట్ ఫెస్టివల్



వివిధ చిత్రాలను పరిశీలిస్తున్న సందర్శకులు

హైదరాబాద్, అక్టోబరు 6, ప్రభాతవార్త: కళలను, కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో తొలిసారిగా ఏర్పాటు చేసిన తెలంగాణ ఆర్ట్‌ఫెస్టివల్ అందరినీ ఆకట్టుకుంటుంది. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లోని జలవిహార్‌లో ఈప్రదర్శనను ఏర్పాటు చేయగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చిత్రకారులు తమ చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. 50మంది చిత్రకారుల కలం నుంచి జాలువారిన 600లకు పైగా చిత్రాలు ఇందులో కొలువుదీరాయి. సింగాణీ పాత్రలపై సినీనటులు, దేవతామూర్తుల, ప్రకృతి అందాలు ఇలా పలు చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వీటితో పాటు విభిన్న రకాలైన వర్ణచిత్రాలు సందర్శకుల మదిని దోస్తున్నాయి. చిత్రకారులను ప్రోత్సహించి వారి చిత్రాలకు సరైన మార్కెట్ కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈప్రదర్శన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకురాలు స్పందన వాసిరెడ్డి తెలిపారు. ఎంతో మంది అద్భుతమైన చిత్రకారుల చిత్రాలను నగర వాసులకు పరిచయం చేయనున్నట్లు ఆమె చెప్పారు. గిగిల్ మగ్ ఈవవెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ఆర్ట్‌ను ఒకవైపు పరిచయం చేస్తూ.. మరోవైపు వచ్చే సందర్శకులకు వినోదం అందించేందుకు సంగీత విభావరి, నృత్యాలు, మంచి రుచికరమైన ఆహారపు రుచులు అందిస్తున్నట్లు తెలిపారు. మూడురోజులపాటు జరిగే ఈప్రదర్శనకు కళాకారులు, కళాభిమానులు అధికసంఖ్యలో హాజరై వారిని ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

## బట్టల దుకాణంలో అగ్ని ప్రమాదం

ధర్నాచౌక్, అక్టోబర్ 6, ప్రభాతవార్త: ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రాంనగర్‌లోని వెంకటేశ్వర మ్యాచింగ్ సెంటర్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ముషీరాబాద్ సీఐ జహంగీర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం రాంనగర్‌లో వెంకటేశ్వర మ్యాచింగ్ సెంటర్‌లో శుక్రవారం ఉదయం మంటలు ఎగిసిపడటం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఫైర్ ఇంజన్ సాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. షాపులో ఉన్న బట్టలు అన్నీ కాలిబూడిద అయ్యాయని, షాపు యజమాని అంచనా ప్రకారం దాదాపు నష్టం 50 లక్షల వరకు ఉండవచ్చునని సీఐ తెలిపారు. షాపు యజమాని రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణం షార్ట్ సర్క్యూటా లేక ఇంకా వేరే ఏదైనా కారణం ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నామని సీఐ వివరించారు.

## ఫీవర్ ఆసుపత్రి వద్ద అగ్నిమాపక కేంద్రం ప్రారంభం



అగ్నిమాపక కేంద్రాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న హోంమంత్రి మహమూద్‌అలీ, ఎమ్మెల్యే బేతి, ఫైర్ సర్వీసెస్ డిజి నాగిరెడ్డి



అగ్నిమాపకకేంద్రాన్ని ప్రారంభిస్తున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

హైదరాబాద్, అక్టోబరు 6 ప్రభాతవార్త: అంబర్‌పేట నియోజకవర్గంలోని నల్లకుంట ఫీవర్ హాస్పిటల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అగ్నిమాపక కేంద్రాన్ని వర్చువల్‌గా రాష్ట్ర హోంమంత్రి మహమూద్ ఆలీతో కలిసి స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ సిఎం కెసిఆర్ తెలంగాణ ప్రజలకు సంక్షేమం, అభివృద్ధితో పాటు భద్రత కూడా అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు విజయకుమార్ గౌడ్, పద్మావెంకటరెడ్డి, సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి కె.యుగంధర్‌ప్రసాద్, అంబర్‌పేట, ముషీరాబాద్, మలక్‌పేట ఫైర్ ఆఫీసర్లు జి.వెంకటేశ్వర్లు, శ్రీధర్‌తో పాటు అంబర్‌పేట ఫైర్‌స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణలో 18 కొత్త అగ్నిమాపక కేంద్రాలు : హోంమంత్రి**

**ఉప్పల్..** తెలంగాణలో నేటి నుంచి కొత్తగా మరో 18 అగ్నిమాపక కేంద్రాలు అందుబాటులోకి తీసుకుని వచ్చినట్లు రాష్ట్ర హోంమంత్రి మహమూద్‌అలీ పేర్కొన్నారు. ఈ మేరకు ఉప్పల్ భగాయత్‌లో కొత్తగా నిర్మించిన అగ్నిమాపక కేంద్రం నుంచి వర్చువల్ పద్ధతిలో వివిధ జిల్లాలో నిర్మించిన అగ్నిమాపక కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సిఎం కెసిఆర్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందన్నారు. పమాదాల నివారణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గతంలో వరదల సమయంలో కూడా ఫైర్ సర్వీసెస్ సేవలు అభినందనీయమన్నారు. గతంలో 26 అగ్నిమాపక కేంద్రాలు ఉండగా, కొత్తగా మరో 18 ప్రారంభించామని, సిబ్బందిని కూడా కొత్తగా నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫైర్ సర్వీసెస్ ఐజి వై.నాగిరెడ్డి, డైరెక్టర్ సి.లక్ష్మిప్రసాద్, అడిషనల్ డైరెక్టర్ జి.వి.నారాయణరావు, రీజనల్ ఫైర్ ఆఫీసర్ బి.హనుమంతరెడ్డి, డిప్యూటి డైరెక్టర్ బి.సుధాకర్, జిల్లా ఫైర్ అధికారి బి.నాగేశ్వర్ రావు, ఎడిఎఫ్ బి.సీనయ్య, వై.యాదగిరి పాల్గొన్నారు.

## మన బస్తీ మన బడితో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోతున్నాయి

**మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**



చిన్నారులకు అల్పాహారం తినిపిస్తున్న హోంమంత్రి అలీ, మంత్రి తలసాని

సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 6, ప్రభాతవార్త : మన బస్తీ మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురే ఖలు పూర్తి స్థాయిలో మారిపోతున్నాయని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం అమీర్‌పేటలోని డికె రోడ్డులో గల ప్రభుత్వ పఠశాలలో విద్యార్థులకు హోంమంత్రి మహమ్మద్ అలీతో కలిసి అల్పాహారం వడ్డించి ముఖ్యమంత్రి అల్పాహారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రి శ్రీనివాస్ జన్మదినాన్ని పురస్కరించుకుని హోంమంత్రి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు మన బస్తీ మన బడీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన జరిగే విధంగా 7200 కోట్ల రూపాయల వ్యయంతో దశల వారిగా అన్ని పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న విషయాన్ని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ముఖ్యమంత్రి సంకల్పం మేరకు రాష్ట్రంలోని 20లక్షల మంది విద్యార్థులకు ఈ కార్యక్రమం క్రింద అల్పాహారం అందిచబడుతుందని తెలిపారు. హైదరాబాద్ జిల్లాలోని 868 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1,46,086లక్షల మంది విద్యార్థులకు ఈ అల్పాహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమీషనర్ వెంకటేష్, కార్పోరేరట్ సరళ, మాజీ కార్పోరేటర్ నామన శేషుకుమరి, తహసిల్దార్ దేవయ్యగౌడ్, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి తలసాని జన్మదిన వేడుకలు




మంత్రి తలసానికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు గుర్రం పవన్ కుమార్ గౌడ్, వివిధ విభాగాల అధికారులు

కంటోన్మెంట్, అక్టోబర్ 6 ప్రభాతవార్త: రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు శుక్రవారం మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద ఘనంగా జరిగాయి. మంత్రి తలసాని పుట్టిన రోజును పురస్క రించుకొని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పోలీసులు, జిహెచ్ఎంసి, రెవెన్యూ వంటి వివిధ విభాగాలకు చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంబర్ పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, విజయ డైయిరీ చైర్మన్ ఎసోమ భరత్ కుమార్ గుప్త, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ రాంచందర్, మత్స్యశాఖ కమిషనర్ లచ్చిరామ్, ఓయు వైస్ ఛాన్స్‌లర్ రవిందర్ యాదవ్, జలమండలి ఎసిజిఎం ప్రభు, జిఎం.క్రిష్ణ, శషాంక్, నర్సింగ్‌రావ్ పాల్గొన్నారు.

**సర్వమత ప్రార్థనలతో మంత్రి తలసానికి అశీర్వాదం..** మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదినం సందర్భంగా జన్మదిన వేడుకలు పండుగ వాతావరణంలో అత్యంత ఘనంగా జరిగాయి. సర్వమత ప్రార్థనలు నిర్వహించి మంత్రిని అశీర్వదించారు. క్రేన్ సహాయంతో బారీ పూలమాలను మంత్రికి అలంకరించారు. అనంతరం కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో



అమ్మవారిని దర్శించుకున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

బిఆర్ఎస్ పద్మారావు నగర్ డివిజన్ ఇన్‌ఛార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు శైలేందర్, వెంకట్‌రాజు, బిట్టపల్లి బాబురావ్, బాల్ రాజ్ యాదవ్ పాల్గొన్నారు.

**ఘనంగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పుట్టినరోజు వేడుకలు**

**సంజీవరెడ్డి నగర్..** మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ పండితులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం ఆలయ పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. తదనంతరం ఆలయంలో పునరుద్ధరించిన అద్దాల మండపాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ నామన శేషుకుమారి, ఆలయ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**కేక్ కట్ చేసిన మంత్రి..**

బల్కంపేటలో మాజీ కార్పోరేటర్ నామన శేషుకుమారి, బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంత్రి తలసాని జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మంత్రి హాజరై కేక్ కట్ చేశారు. ముందుగా మహిళా నాయకులు, కార్యకర్తలు, మంత్రికి మంగళహారతులతో స్వాగతం పలికి నుదుటన తిలకం దిద్దారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ అమీర్‌పేట డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు సంతోష్, అశోక్ యాదవ్, శివ, కూతురు నరసింహా, కుమార్, వనం శ్రీనివాస్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా శ్రీసంగమేశ్వర శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలు

నాంపల్లి, అక్టోబరు 6 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలోని గాంధీనగర్ ఎస్‌బిహెచ్ కాలనీ వద్దనున్న అతిపురాతన శ్రీ సంగమేశ్వరస్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామి వార్ల దేవాలయంలో వేంచేసియున్న శ్రీ పార్వతీ అమ్మవారికి ఆశ్వీయుజ మాస శుక్లపక్ష పాడ్యమి 15-10-2023 ఆదివారం నుండి దశమి (విజయదశమి) 23-10-2023 సోమవారం వరకు శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలు కన్నులపండువగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లక్ష్మారెడ్డి తెలిపారు. అత్యంత వైభవోపేతంగా నవరాత్రుల్లో ప్రతీరోజు జరిగే కార్యక్రమాల్లో ఉదయం 5గంటలకు అమ్మవారి అభిషేకం; 9గంటలకు అమ్మవారి అలంకార దర్శనం; 10నుండి 12గంటల వరకు అమ్మవారి హవనము, లఘు పూర్ణాహుతి, మహానివేదన, మంగళ హారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణలు; రాత్రి 6.30గంటల నుండి శ్రీ లలితా సహస్రనామార్చన, నివేదన, మంగళహారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాదాల వితరణ తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. అమ్మవారి దివ్యాలంకారాల పూజాకార్యక్రమాల్లో భాగంగా 15 ఆదివారం ఉదయం 5గంటలకు శ్రీ విఘ్నేశ్వ రపూజ, పుణ్యహావాచనము, అఖండ దీపారాధన, అంకురారోహణము, మృత్స ంగ్రహణం, దీక్షాస్వీకారము, కలశస్థాపన, అభిషేకము, 9గంటలకు శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి అలంకారము నయనానందకరంగా జరుపబడతాయని, అధికసంఖ్యలో భక్తులు విచ్చేసి ఆయా పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదములు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ, కార్యనిర్వహణాధికారి పి.లక్ష్మారెడ్డి సూచించారు.

## కాంగ్రెస్ ఆరు పథకాల ప్రచారం



బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆరు పథకాల హామీల కోసం కాంగ్రెస్ ప్రచారాన్ని ప్రారంభించిన రోహన్‌రెడ్డి, కాటూరి రమేష్

ఫిల్మ్‌నగర్, అక్టోబర్ 6, ప్రభాతవార్త : ఆరు హామీల పథకాల కోసం ఇంటింటికి ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం ప్రారంభించింది. జిల్లా అధ్యక్షుడు, ఖైరతాబాద్ నియోజకవర్గ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న రోహన్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి శుక్రవారం ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ఆరు పథకాల హామీల పథకాన్ని ఖైరతాబాద్ జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు చేరువ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ డివిజన్‌ల అధ్యక్షులు కాటూరి రమేష , గొల్ల రాజు, శ్యామ్ నాయుడు, అశోక్ కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్ సంతోష్‌ను కలిసిన బిజెపి నేత జూటూరు కీర్తిరెడ్డి

ఫిల్మ్‌నగర్, అక్టోబర్ 6, ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్‌ను హైదరాబాద్ సెంట్రల్ జిల్లా భాజపా ఉపాధ్యక్షురాలు, జూబ్లీహిల్స నియోజకవర్గం నాయకురాలు జూటూరు కీర్తిరెడ్డి శుక్రవారం పార్టీ పటిష్టత కోసం తాను చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. జూబ్లీహిల్స్‌లో భాజపా పతకాన్ని రెపరెపలాడించాలని బిఎల్ సంతోష్ దిశా నిర్దేశం చేశారు.

## 8న పరేడ్ గ్రౌండ్‌లో ముదిరాజ్‌ల ఆత్మ గౌరవ సభను విజయవంతం చేయాలి

పిట్ల నాగేశ్



సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద ముదిరాజ్‌ల ఆత్మ గౌరవ సభ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న పిట్ల నాగేశ్ తదితరులు

కంటోన్మెంట్, అక్టోబర్ 6 ప్రభాతవార్త: ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండగా ఏర్పాటు చేయనున్న ముదిరాజ్ ఆత్మ గౌరవ సభను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని తెలంగాణ ముదిరాజ్ సంఘాల ఐక్య వేదిక నగర ఉపాధ్యక్షుడు పిట్ల నాగేశ్ తెలిపారు. శుక్రవారం సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద ఉన్న కొర్వి క్రిష్ణ స్వామి విగ్రహం వద్ద ముదిరాజ్‌ల బహిరంగ సభ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు జింఖల వేణుగోపాల్, నిరుడు అశోక్ కుమార్, మద్దెల యాదగిరి,సొక్కం శ్రీనివాస్, కుమ్మరి అంజనేయులు, ప్రముఖ న్యాయవాది జగన్ మోహన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## తెల్లఉప్పలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు

చిక్కడపల్లి, అక్టోబరు 6 ప్రభాతవార్త: బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులోని తెల్లఉప్పలమ్మ అమ్మవారి దేవాలయం ఆవరణలో ప్రతి శుక్రవారం నిర్వహించే పూజా కార్యక్రమం బిఆర్ఎస్ సీనియర్ నేత ఆర్.వివేక్ ఆధ్వర్యంలో జరిగింది.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేతలు బబ్లూ(వెంకటకృష్ణ), అయిలినేని కిషన్‌రావు, రాజేంద్రప్రసాద్ గౌడ్, నాగభూషణం, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, సంతోష్‌కుమార్‌గౌడ్, రాజు, కృష్ణ, వాకర్స్ పాల్గొన్నారు.

## ఉద్యమకారులు బిఆర్ఎస్ గెలుపుకు పాటుపడాలి



మున్నూరు కాపు సమావేశంలో పాల్గొన్న ఆర్వీమహేందర్‌కుమార్

బేగంబజార్,అక్టోబర్ 6ప్రభాతవార్త: రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గోషామహల్ నియోజక వర్గం బిఆర్ఎస్ టిక్కెట్ గ్రేటర్ హైదరాబాద్ మున్నూరు కాపు అధ్యక్షులు ఉద్యమనేత ఆర్వీమహేందర్‌కు ఇవ్వాలని మున్నూరు కాపు సంఘం తీర్మానం చేశారు. తెలంగాణ ఉద్యమనేత,గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు ఆర్వీమహేందర్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఉద్యమ కారులంతా బిఆర్ఎస్ గెలుపు కోసం పాటుపడాలని, ముఖ్యమంత్రి కెసిఆర్,మంత్రి కెటిఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అణగారిన, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం దళితబంధు,బిసి బంధు,రైతుబంధు పథకాలను అమలు చేసిన గొప్ప నాయకుడన్నారు. ఈసమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## టీడీపీ లేకపోతే బీఆర్ఎస్‌కు రాజకీయ మనుగడ లేదు

టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా



ధర్నాచౌక్, అక్టోబర్ 6, ప్రభాతవార్త: టీడీపీ లేకపోతే బీఆర్ఎస్ నాయకులకు రాజకీయ మనుగడే లేదని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా అన్నారు. శుక్రవారం టీడీపీ నగర కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్ట్‌పై బీఆర్ఎస్ నాయకులు స్పందించిన తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ పార్టీ ద్వారా రాజకీయ భవితవ్యం పొందిన తలసాని శ్రీనివాసయాదవ్ మానవీయ కోణంలో స్పందించకుండా రాజకీయ ప్రయోజనాల కోసం పాకులాడటం ఆయన అవకాశవాదానికి నిదర్శనమని ఆరోపించారు. తలసానితో పాటు ఎర్రబెల్లి, ఎల్.రమణ లాంటి నాయకులు తమ పదవులకు రాజీనామా చేసి, చంద్రబాబు నాయుడికి అండగా నిలబడాలని అన్నారు. ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దోజు రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

## పథకాల అమలులో ప్రభుత్వం దేశానికే ఆదర్శం

బ్రేక్‌ఫాస్ట్ ప్రారంభ సమావేశంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

ధర్నాచౌక్, అక్టోబర్ 6, ప్రభాతవార్త: సంక్షేమ పథకాలు అమలు చేయంటంలో బీఆర్ఎస్ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సీఎం బ్రేక్ ఫాస్ట్ స్కీంలో భాగంగా ముషీరాబాద్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ముఠా గోపాల్ స్వయంగా అల్పాహారం అందించి, వారితో కలసి ఆయన కూడా సేవించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులు ఎవరూ ఆకలితో ఉండకూడదని, వారికి మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం బలవర్ధకమైన ఉపాహారం కూడా అందించాలనే ఆలోచనతో మన ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టటం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటి కమీషనర్ తిప్పర్తి యాదయ్య, డిఈఓ చిరంజీవులు, స్థానిక బీఆర్ఎస్ నేతలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్యవివాహ రహిత సమాజం నిర్మిద్దాం

మెట్రోపాలిటన్ సీనియర్ సివిల్‌జడ్జి రాధిక జైశ్వాల్

నాంపల్లి, అక్టోబరు 6 ప్రభాతవార్త : హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి, లీగల్ అథారిటీ ఛైర్మన్ ఎస్.ప్రేమావతి ఆదేశాల మేరకు బాల్యవివాహ రహిత సమాజం నిర్మిద్ధామని నినదించి మెట్రోపాలిటన్ సీనియర్ సివిల్‌జడ్జి, కార్యదర్శి రాధికా జైశ్వాల్ ఈ ప్రచారంలో భాగంగా సంస్థ పారాలీగల్ వాలంటీర్లు ఆశ్రిత, ఎన్.జి.ఓ.లు తదితరులతో కలిసి బాల్యవివాహాల నుండి స్వేచ్ఛ గోడపత్రికను ఆవిష్కరించిక ప్రతీఒక్కరూ బాల్యవివాహ రక్షిత సమాజ అభివృద్ధికి తమవంతు బాధ్యతగా కృషిచేయాలని, బాధితులకు చేయూతనిచ్చి తగిన సంపూర్ణ సహాయసహకారాలను అందించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆశ్రిత సంస్థ నుండి రక్షణ పొందిన ఇద్దరు బాలికల అనుభవాలను వివరిస్తూ ఆశ్రిత వాని విద్యాభివృద్ధిలో సహాయసహకారమందించామని, ఆ ప్రోత్సాహంతో వారిలో ఒక బాలిక యునైటెడ్ నేషన్స్ చిల్డ్రన్స్ ఫండ్ నుండి బాలబాలికల సంరక్షణకు సంబంధించి దేశవ్యాప్తంగా వివిధ ప్రచార కార్యక్రమాలలో పాల్గొంటున్నందుకు లీగల్ సర్వీసెస్ కార్యదర్శి రాధిక జైశ్వాల్ ఆశ్రిత సంస్థను ఎంతగానో అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ నామినేటెడ్ సభ్యుడు, కోఆర్డినేటర్ అబ్దుల్‌వాసి, పారాలీగల్ వాలంటీర్ మజీదుద్దీన్, ఆశ్రిత ఎన్జీవో కార్యకర్తలు, ఇతర పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యూలరైజ్ చేయాలి



ఓ.యూలో ఆమరణ నిరహార దీక్షకు కూర్చున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

తార్నాక, అక్టోబర్ 6 ప్రభాతవార్త: సీఎం కేసీఆర్ ఇచ్చిన హామి ప్రకారం తమను రెగ్యూలరైజ్ చేయాలని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు ఓ.యూలో శుక్రవారం ఆమరణ నిరహార దీక్షకు పూనుకున్నారు.వివిధ వర్సిటీల్లో పనిచేస్తున్న అధ్యాపకులు ప్లకార్డులు పట్టుకొని తమను ప్రభుత్వం రెగ్యూలరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. సాయంత్రం దీక్షలో కూర్చున అధ్యాపకులను ఓ.యూ పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు దీక్షలో కూర్చున్న టీఆక్టా చైర్మన్ డా. శ్రీధర్‌కుమార్, వర్కింగ్ చైర్మన్ డా. రామేశ్వర్ రావు, కన్వీనర్ బి.రాజేష్ ఖన్నా, డా. దత్తాహరి, డా. వెంకటటేశ్వర్లు మాట్లాడుతూ 157 రోజులుగా ఎన్నో నిరసనలు చేస్తున్నామని, గత 15 రోజులుగా పెన్ డౌన్, నిరవధిక సమ్మె చేస్తున్నా తమను ప్రభుత్వం, ఉన్నత విద్యామండలి నుంచి ఎలాంటి స్పందనరావడంలేదన్నారు. అందుకోసం గత్యంతరంలేక ఆమరణ దీక్షకు పూనుకుంటున్నామని చెప్పారు. ఏండ్ల తరబడి విధులు నిర్వహిస్తున్నామని తమను సీఎం కేసీఆర్ రెగ్యూలరైజ్ చేస్తామని హామినిచ్చిన ప్రకారం రెగ్యూలరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్, ఉన్నత విద్యామండలి స్పష్టమైన హామి ఇచ్చేవరకు దీక్ష కొనసాగిస్తామని వారు హెచ్చరించారు.

## మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వ కృషి : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



టైలరింగ్ మిషన్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 6, ప్రభాతవార్త : మహిళ సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత వ్రం కృషి చేస్తుందని కూకట్‌పల్లి నియోజకవర్గం శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం ఖార్దు స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహిస్తున్న కుట్టుమిషన్ల ట్రైనింగ్‌లో భాగంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సొంత నిధులతో నియోజకవర్గం లోని 1000 మందికి మహిళలకు కుట్టు మిషన్లు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు అర్థికంగా ప్రగతి సాధించి ఉన్నత స్థానానికి ఎళ్ళాలన్న ఉద్దేశ్యంతో తమవంతు సహాయంగా ఖార్దు సంస్థ వారి ఆధ్వర్యంలో శిక్షణ ఇప్పించి ఈ విధంగా కుట్టుమిషన్లు అందిస్తున్నామని తెలిపారు. ఇందుకు సహకరిస్తున్న ఖార్దు సంస్థ అధినేత సుమన్ దంపతులను అభినందించారు. ఈ నేపథ్యంలోనే అవంతినగర్ తోట కూకట్‌పల్లి శేషాద్రి నగర్, కమ్యూనిటీ హాల్ కెపిహెచ్‌బి కాలనీ 4వ ఫేస్‌లోని మల్లీపర్పస్ ఫంక్షన్ హాల్లో మహిళలకు కుట్టు మిషన్లను ధ్రువీకరణ పత్రాలును అందించారు. ఈ కార్యక్రమంలో మందడి శ్రీనివాసరావు, పండాల సతీష్‌గౌడ్, సభియ గౌసుద్దీన్, మాజీ కార్పోరేటర్ తూము శ్రవన్ కుమార్, కార్దు సంస్థ అధినేత సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## సాలూరి సంగీత పురస్కారాలు ప్రదానం

చిక్కడపల్లి, అక్టోబరు 6 ప్రభాతవార్త: రసమయి సంస్థ ఆధ్వర్యంలో రఘుపతి వెంకయ్య అవార్డుగ్రహీత డాక్టర్ సాలూరి రాజేశ్వరరావు 101 జయంతి మహోత్సవాన్ని పురస్కరించుకుని సాలూరి సంగీత పురస్కారాలను ప్రదానం చేయబోతున్నట్లు నిర్వాహకసంస్థ అధినేత, ప్రముఖ కవి డాక్టర్ ఎం.కె.రాము వివరించారు. గత నాలుగు దశాబ్దాలకుపైగా సంగీత రంగంలో విశేషమైన కృషి చేస్తున్న స్వకర్తలకు, గాయనీ గాయకులకు ఈ పురస్కారాలను ముఖ్యఅతిథిగా హాజరవుతున్న తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి చేతులమీదుగా అందించడం జరుగుతుందన్నారు. తెలంగాణ నీటిపారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ సాలూరి వాసురావు పాల్గొంటారన్నారు.

# అమ్మవారి దర్శనాన్ని అడ్డుకుంటున్న అధికార పార్టీ నేత



ఆలయానికి వెళ్ళకుండా రోడ్డును ఆక్రమించి కందకం తీసిన దృశ్యం

నిజాంపేట, అక్టోబర్ 6 ప్రభాతవార్త: కబ్జాలకు కాదేది అనర్హం అనే నానుడిని అక్షరాల నిజం చేస్తున్నారు నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లోని అధికార పార్టీ కార్పొరేటర్. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడమే లక్ష్యంగా ఆయన పయనిస్తుంటారు. కబ్జాల దారిలో ఆయనకు ఎటువంటి అడ్డు లేకుండా అధికార గణం చాల శ్రమిస్తూ అందుకు తగిన ఫలితం పొందుతున్నారు అనేది బహాటంగానే వినిపిస్తుంది. అడుగడుగా కబ్జాలు చేసే ఆయన ఆఖరికి అమ్మవారి దారిని వదల్లేదు. అమ్మవారి దర్శనానికి వెళ్ళకుండా దారిని ఆక్రమించి కందకం తవ్వారు. సదరు కార్పొరేటర్ కాసులకు కక్కుర్తి పడుతున్న అధికారగణం ఎమ్మెల్యే ఆదేశాలను ఆలయం పక్కన ఉన్న తుర్క చెరువు తుంగలో తొక్కారు. వివరాల్లోకి వెళితే.. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి తుర్క చెరువు సమీపంలో చర్ల ఎల్లమ్మతల్లి ఆలయం ఉంది. గత రెండు దశాబ్దాలుగా భక్తుల పూజలందుకుంటూ కొలిచిన వారికి కొంగుబంగారమైంది. అయితే అమ్మవారి ఆలయం పక్కన ఉన్న సర్వేనంబర్ 334లోని ప్రభుత్వ స్థలంపై కన్నేసిన కార్పొరేటర్ కుటుంబసభ్యులు సర్వేనంబర్ సర్వేనంబర్ 333 పత్రాలను చూపుతూ ఆక్రమించారు. అనుమతులు లేకుండా ప్రభుత్వస్థలం, చెరువు ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్లను ఆక్రమించి బహుళ అంతస్తులు నిర్మించారు. నిర్మాణాలు కొనసాగుతున్న సమయంలో ఫిర్యాదులు ఉన్న మున్సిపల్, రెవిన్యూ యంత్రాంగాలు కన్నెత్తి చూసిన పాపన పోలేదు. రెచ్చిన కార్పొరేటర్ కుటుంబసభ్యులు అమ్మవారి ఆలయానికి వెళ్ళే రహదారిని సైతం ఆక్రమించే యత్నం చేయగా విషయాన్ని జర్నలిస్టుకాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, స్థానికులు ఎమ్మెల్యే వివేకానంద్ దృష్టికి తీసుకెళ్ళారు. స్పందించిన ఆయన అమ్మవారి దర్శనానికి సజావుగా వెళ్ళేందుకు రోడ్డు వేయటానికి మున్సిపల్ నిధుల నుండి రూ,11లక్షలు మంజూరు చేశారు. అయితే రోడ్డు వేయకుండా అడ్డుపడడంతో పాటు రోడ్డు మధ్యలో కందకం తవ్వారు. మరలా విషయం ఎమ్మెల్యే దృష్టికి వెళ్లడంతో సర్వేచేసి రోడ్డు వేయాలని అధికారులను ఆదేశించారు. సంవత్సర కాలం నుండి సర్వేయర్ లేదంటూ రెవిన్యూ అధికారులు కాలయాపన చేస్తూ వస్తున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలను ఏమాత్రం పట్టించుకొని అధికారులు అందినకాడికి దండుకుంటూ కార్పొరేటర్‌కు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నట్లు తెలుస్తుంది.

## అబద్ధపు వాగ్దానాలతో ప్రజల్ని మోసం చేస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే

టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యంశ్రీరంగం



సత్యం శ్రీరంగంను అరెస్టు చేస్తున్న పోలీసుల

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 6, ప్రభాతవార్త : గత 2016లో శంకుస్థాపన చేసిన ప్రభుత్వ కళాశాల భవనం ఇప్పటికీ పూర్తి చేయలేని అసమర్థ ఎమ్మెల్యే అబద్ధపు వాగ్దానాలతో ప్రజల్ని మోసం చేస్తున్న మాధవరం కృష్ణారావు అని పిసిసి సభ్యులు డా.సత్యం శ్రీరంగం ఆరోపించారు. కూకట్‌పల్లి నియోజకవర్గం బాలాజీ నగర్ డివిజన్‌లో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనానికి 2016లో కడియం శ్రీహరి విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు శంకుస్థాపన చేసి ఇప్పటివరకు కళాశాల భవనాన్ని నిర్మాణం జరగలేదని ఇప్పుడున్న విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి త్వరలో కళాశాల భవనం కడతామని మాట ఇచ్చి ఇప్పటివరకీ నిర్మించనందుకు విఫలమైన ఈ బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని, ప్రజల్ని మోసం చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్యాన్ని తప్పుపడుతూ విద్యార్థులు జీవితాలతో చెలగాటం ఆడొద్దని సత్యం శ్రీరంగం ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా సత్యంశ్రీరంగం మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కూకట్‌పల్లి నియోజకవర్గంలో 90శాతం అభివృద్ధి జరిగిందని అబద్ధపు మాటలు చెప్పన్నారని అన్నారు. కళాశాల భవనం కోసం 2016లో విద్యాశాఖ మంత్రి శిలాఫలకం వేస్తే 2021లో కాంగ్రెస్ పార్టీ తరపున మేము ఇక్కడికి వచ్చి ధర్నా చేసినప్పటికే శిలాఫలకం వేసి 5 సంవత్సరాలు అయ్యిందని, ఇప్పటికి 7 సంవత్సరాలు అయినా భవనాన్ని ఎందుకు కట్టలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో పుష్పారెడ్డి, నాగిరెడ్డి, వేణు, నవీన్‌గౌడ్, నర్సింహాయాదవ్, క్రిష్ణరాజ్‌పుత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్య సాధనకు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న ప్రముఖ మానసిక వికాస నిపుణులు గంపా నాగేశ్వరరావు

చిక్కడపల్లి అక్టోబరు 6 ప్రభాతవార్త: విద్యార్థులు అనుకున్న లక్ష్య సాధన కోసం సమయపాలన, క్రమశిక్షణతో కృషి చేస్తే ఉత్తమ ఫలితాలను సాధిస్తారని ప్రముఖ మానసిక వికాస నిపుణులు, ఇంపాక్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంపా నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో విద్యార్థినీ విద్యార్థులకు వివిధ అంశాలపై కౌన్సెలింగ్ కార్యక్రమాలకు సంబంధించి సదస్సు న్యూ ఎరా కళాశాల అధినేత డాక్టర్ ఎన్.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ గంపా నాగేశ్వరరావు మాట్లాడుతూ చిన్న వయస్సులో విథ్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కావద్దని సూచించారు. స్మార్ట్ ఫోన్‌లకు దూరం ఉంటూ మనకంటు లక్ష్యం లేకపోతే ఇతరుత లక్ష్య సాధన కోసం పనిచేయాల్సి వస్తుందనే విషయాన్ని గుర్తు చేశారు. ఉపాధి పొందడం, ఉద్యోగాలు సాధించడం మాత్రమే కాకుండా ఉపాధి, ఉద్యోగాలు అందించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. విద్యార్థుల కోసం తల్లిదండ్రులు ఎంతో కష్టపడతారనే విషయాన్ని మరిచిపోవద్దని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా కష్టపడి చదవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలకు సేవ చేసేందుకు అవకాశం ఇవ్వాలి



అత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న జిజివైఎఫ్ చైర్మన్,బిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్

గోషామహల్,అక్టోబర్ 6ప్రభాతవార్త: గోషామహల్ నియోజకవర్గంలో నాయకత్వం లోపం ఉన్నందునే ఇతర పార్టీల వారు శాసనసభ్యులుగా అవుతున్నట్లు తనకు ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాలని గడ్డం గంగాధర్ ఫౌండేషన్ చైర్మన్,బిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ బిఆర్ఎస్ అధిష్టానికి విన్నవించారు.శుక్రవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో గడ్డం గంగాధర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో10 వేల మందితో ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతంగా నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ టిక్కెట్ ఇచ్చే ముందు బిఆర్ఎస్ అధిష్టానం సర్వే చేయించి ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాలని, బెంజి కార్లో తిరిగే వారికి ప్రజలకు ఎలాంటి సేవ చేయకుండా హడాహుడి చేసే నాయకులకు తొందరపడి టిక్కెట్ కేటాయించ వద్దని ముఖ్యమంత్రి కెసిఆర్,మంత్రి కెటిఆర్‌లను విజ్ఞప్తి చేశారు.బిఆర్ఎస్‌లో చేరిన తరువాత తాను దళిత బస్తీలో నిద్ర చేయడంతోపాటు పేద విద్యార్థులకు ఇంటర్ నుంచి డిగ్రీ,పిజి వరకు ఉచిత విద్యను అందిస్తున్నట్లు చెప్పారు.అంతే కాకుండా జాబ్ మేళాను నిర్వహించి సుమారు 2వేలమందికి ప్రైవేట్ కంపెనీలలో ప్రభుత్వ సహాకారంతో ఉద్యోగాలను కల్పించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జి.జి.వై.ఎఫ్ ప్రతినిధులు బద్దం సతీష్‌గౌడ్,బిఆర్ఎస్ నాయకులు జైశంకర్, వినోద్‌యాదవ్,శీలంసర్వసతి, జి.యాదగిరి,సతీష్,సురేష్,గడ్డం సురేష్‌యాదవ్, గడ్డం గగన్‌యాదవ్,గౌరవ్‌యాదవ్,కృష్ణాయాదవ్,వేలాదిమంది బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## రంగదాముని లేక్ ఫ్రంట్ పార్క్ ఏర్పాటు చేయడం అభినందనీయం

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 6, ప్రభాతవార్త : కూకట్‌పల్లి ప్రజల సౌకర్యార్థం ఐడియల్ పరిశ్రమ సమీపంలో రంగదాముని లేక్ ఫ్రంట్ పార్క్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయని కూకట్‌పల్లి బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కంచనపల్లి నాగరాజు పేర్కొన్నారు. దాదాపు 19.5కోట్లతో ఏర్పాటు చేసిన ఇక్కడి రంగదాముని లేక్ ఫ్రెండ్ పార్క్ ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు నిరంతరం అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రజల కోసం పలు రకాల మౌలిక సదుపాయాలు కల్పించారని కొనియాడారు.మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు, బిఆర్ఎస్ నాయకులు తిరుపతిరావు, సుశీల్, రమణ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న బిఆర్ఎస్ నాయకురాలు గుంటి మంజుల రాణి

## మహిళల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం

చార్మినార్,అక్టోబరు 6 ప్రభాతవార్త : మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదని చార్మినార్ నియోజకవర్గం బిఆర్ఎస్ సీనియర్ నాయకురాలు గుంటి మంజుల రాణి అన్నారు.దూద్‌బౌలి మున్నూరు కాపు సంఘం భవనంలో శుక్రవారం ఆమె మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని పండుగలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు.పలు ప్రాంతాలకు చెందిన మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశామని మంజలు రాణి తెలియజేశారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఎం.సంగీత గౌరీ శంకర్

మైలార్‌దేవ్‌పల్లి,అక్టోబరు 6 ప్రభాతవార్త : అత్తాపూర్ డివిజన్ అభివృద్ధి కోసం అన్ని విధాల పాటు పడుతున్నానని డివిజన్ కార్పొరేటర్ ఎం.సంగీత గౌరీ శంకర్ అన్నారు. హైదర్‌గూడ న్యూ ఫ్రెండ్స్ కాలనీలో పద్నాలుగు లక్షల పదిహేను వేల రూపాయల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను శు క్రవారం ఆమె బిజెపి నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు కాలనీలోని రహదారులు చాలా అధ్వాన్నస్థితికి చేరుకోవటంతో జిహెచ్ఎంసి అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించటంతో రోడ్లు పనులు జరుగుతున్నాయని తెలిపారు. బిజెపి నాయకులు బిటుకూరి సిద్దేశ్వర్ సన్నీ వెల్లి,శ్రీపాల్ రెడ్డి,ఎల్.వెంకటేష్,బి. అనురాధ,ప్రభాకర్‌రెడ్డితో పాటు కాలనీ వాసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆత్మవిశ్వాసంతోడైతే పట్టుదల తోడైతే మహిళలే మహరాణులు

డాక్టర్.నరేశ్ కొండల





ఎన్ఆర్‌సి గార్డెన్స్‌లో జరిగిన వనితా మహిళా డిగ్రీకళాశాల నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

కుత్బుల్లాపూర్, అక్టోబరు 6 ప్రభాతవార్త : విద్యార్థినులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని పట్టుదలతో కృషిచేస్తేనే అనుకున్న లక్ష్యాలను సాధించి మహరాణులుగా గుర్తింపబడతారని చింతల్ వనిత మహిళా డిగ్రీకళాశాల నిర్వాహకులు డాక్టర్.నరేశ్ కొండల అన్నారు. కళాశాల నూతన విద్యార్థులతో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈసందర్భంగా కళాశాల డైరెక్టర్‌లు కళాశాల డైరెక్టర్ కె.లావణ్య నరేశ్, డీన్ కె.మౌనిక, డైరెక్టర్.హరికృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ ఆర్.రాజయ్యలు పాల్గొన్నారు. ఈసదర్భంగా డాక్టర్.నరేశ్ కొండల మాట్లాడుతూ ఏరంగంలోనైనా విజయం సాధించేందుకు దగ్గరిదారులంటూ లేవని నిరంతరం శ్రమించి విజయం సాధించాల్సిందేనని సూచించారు. విద్యార్థిదశలో ఏకాగ్రతతో చదువుపై శ్రద్ధ పెట్టడంతో పాటు కష్టపడి చదవడంతో పాటు ఇష్టపడి చదివితేనే విజయం సాధ్యమన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన వివిధ దేశభక్తి గేయాలు, సినిమా పాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## బహుముఖ ప్రజ్ఞాశాలి అడవి బాపిరాజు

తెలంగాణ పోలీసుహౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కొల్లేటి దామోదర్‌గుప్త



సమావేశంలో ప్రసంగిస్తున్న తెలంగాణ పోలీసుహౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కొల్లేటి దామోదర్‌గుప్త

చిక్కడపల్లి, అక్టోబరు 6 ప్రభాతవార్త: బహుముఖ ప్రజ్ఞాశాలి ప్రముఖ సాహితీవేత్త అడవి బాపిరాజు అని తెలంగాణ పోలీసుహౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కొల్లేటి దామోదర్‌గుప్త అన్నారు. శతాబ్దిపూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సాహితీవేత్త అడవి బాపిరాజు జయంతి సభ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కొల్లేటి దామోదర్‌గుప్త మాట్లాడుతూ తెలుగు భాషలో దేశమంతటా ప్రచారంలో ఉన్న 'బావాబావా పన్నీరు' పాట బాపిరాజు రాసిందేనని అన్నారు. కవిత్వం, కథా రచన, నాటకం, జర్నలిజం, పెయింటింగ్, శిల్పం, సంగీతం, నృత్యం వంటి అనేక రకాల ఆసక్తిని కలిగిన బహుముఖ వ్యక్తిత్వం ఆయనకే సంత మన్నారు. తన రచనల ద్వారా తెలుగు సాహిత్యం, కళలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదిం చారన్నారు. ఈ కార్యక్రమంలో సాహితికిరణం ఎడిటర్ పొత్తూరి సుబ్బారావు, జీవిఆర్ ఆరాధన సంస్థ అధినేత గుదిబండి వెంకటరెడ్డి, ప్రముఖ గాయనీ తోట శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ మహారథయాత్రను విజయవంతం చేయాలి



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న శ్రీరామ్, యోగేష్ ప్రభుస్వామి, కళ్యానందుస్వామి, రమేష్, చంద్రారెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 6,ప్రభాతవార్త: అక్టోబర్ 8నుంచి నిర్వహించనున్న ఛత్రపతి శివాజీ మహారాజ్ మహాయాత్రను విజయవంతం చేయాలని బ్రాహ్మణ సంఘాల నాయకులు, రాజకీయ విశ్లేషకులు తురగా శ్రీరామ్ పిలుపు నిచ్చారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈమహారథయాత్రను రెండు తెలుగు రాష్ట్రాల్లోని హిందువులు అదికసంఖ్యాలో హాజరై విజయవంతం చేయా లన్నారు. విశ్వమానవాళి శ్రేయస్సు అనే పవిత్ర ఉద్దేశాన్ని కాంక్షిస్తూ సర్వసంపదలు, సమస్తవిలువల తో కూడిన దివ్వకాంతులతో మహరుషుల ఘోర తపస్సువల్ల భారతదేశం నిర్మాణం జరిగిందన్నారు. ఇంతటి మహోన్నత సాంస్కృతిక వ్యవహారాన్ని విధ్వంసం చేయడానికి విదేశీ మూకలు, సాంస్కృతి మూలాలైె దేవాలయలపై దాడులు చేసి దేశాన్ని తీవ్ర నష్టంలోకి నెట్టారన్నారు. ఈసమావేశంలో ఛత్రపతి యువసేన అధ్యక్షులు యోగేష్ ప్రభుస్వామి, రాష్ట్రీయ సాధు సంరక్షణ సమితి కల్యానందు స్వామి, ఆహ్వానం కమిటటీ కన్వీనర్ ,రమేష్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 29, 30 తేదీలలో ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు

సైఫాబాద్, అక్టోబరు 6 ప్రభాతవార్త: అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర రెండోవ మహాసభలు ఈ నెల 29, 30 తేదీలలో నగరంలోని హిమాయత్‌నగర్‌లోగల తేరాఫంత్ భవన్ నిర్వహిస్తున్నామని సమాఖ్య తెలిపింది. ఈ మేరకు శుక్రవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలీ ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర తదితరులు ఈ మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యా, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం ఎఐవైఎఫ్ నిరంతరం పోరు సాగిస్తుం దని, పాలకులు అవలంబిస్తున్న యువజన వ్యతిరేక విధానాలపై రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలను నిర్వహించిన చరిత్ర ఎఐవైఎఫ్‌కు ఉందని వారు స్పష్టం చేశారు. రాష్ట్రంలో బిఆర్ఎస్, కేంద్రంలో బిజెపి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై ఈ మహాసభలలో నిర్దిష్టంగా చర్చలు జరగనున్నాయని, త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ మహాసభలు ప్రాచుర్యాన్ని సంతరించుకోనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ నాయకులు నిర్లకంటి శ్రీకాంత్, లింగం రవి, వెంకటేశ్వర్లు, సత్యప్రసాద్, సల్మాన్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## డిమాండ్ల సాధనకు 15న బిసిల రాష్ట్ర మహాసభ


సమావేశంలో మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ, గుజ్జకృష్ణ

హైదరాబాద్, అక్టోబర్ 6,ప్రభాతవార్త: బిసి ముఖ్యమంత్రి సాధన, తక్షణ బిసిజనగణన, చట్టసభల్లో బిసి రిజర్వేషన్లు, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు వంటి డిమాండ్ల భవిష్యత్ కార్యాచరణకై ఈనెల 15న కాచిగూడలోని మూన్నూరుకాపు భవన్‌హాల్‌లో రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం, బిసిల రాష్ట్ర మహాసభ నిర్వహించనున్నట్లు బిసిసంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ తెలిపారు. ఈమేరకు శుక్రవారం విద్యానగర్‌లోని బిసిభవన్‌లో జరిగిన కోర్ కమిటీ సమాశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషనన్ల అసమతుల్యత విధానాల కారణంగా అగ్రకులాలకు ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల ద్వారా 80మార్కులకు కానిస్టేబుల్ ఉద్యోగం వస్తే.. బిసికులాలకు 104మార్కులు వచ్చినా ఉద్యోగం వచ్చే పరిస్థితి లేదన్నారు. ప్రధాని మోదీ ఇందూర్, పాలమూరులో పర్యటించినా 70శాతం ఉన్న బిసిల అంశాలేవి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. బిసి ప్రధాని ముఖం చూపిస్తూ బిజెపి అగ్రకులా ఎజెండాను కొనసాగిస్తుందని ఇటువంటి బిసి వ్యతిరేక అలోచనలతోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా 2015లో సమగ్రకుటుంబసర్వే చేసినా ఇప్పటివరకు ప్రకటించలేదన్నారు. ఈకార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, ఉపాధ్యక్షులు సత్యం, రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ, పి.సుధాకర్, శ్రీనివాస్‌యాదవ్, నందగోపాల్, వేముల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఒయూలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు

**వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్**


రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్

తార్నాక, అక్టోబర్ 6 ప్రభాతవార్త: ప్రభుత్వ సహకారంతో ఒయూలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. ఓ.యూ కాంపౌండ్ వాల్‌కి సమాంతరంగా ఎన్‌సీసీ గేట్ జంక్షన్ నుంచి అడిక్ మెట్ వంతెన వరకు నిర్మించనున్న రోడ్డు నిర్మాణం పనులకు వైస్ చాన్స్‌లర్ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వైస్ చాన్లర్ మాట్లాడుతూ శివం రోడ్డు, ఎన్‌సిసి, విద్యానగర్ వైపు వెళ్లాల్సిన వాహనాలతో క్యాంపస్ రద్దీగా మారుతోందని అందుకోసం బైపాస్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. దీని ఫలితంగా ఓ.యూలో ప్రశాంత వాతావరణాన్ని కల్పించేందుకు వీలుపడుతుందన్నారు. రోడ్డు నిర్మాణం కోసం ఎన్నో ఏళ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి కేటీఆర్ చొరవతో రూ. 16 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణానికి హెచ్ఎండీఏ ముందుకొచ్చిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.పి.లక్ష్మినారాయణ, ప్రిన్సిపల్స్, డీన్స్, అధ్యాపకులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అల్పాహార పథకం ప్రారంభించిన ఎమ్మెల్యే


విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్, అక్టోబర్ 6 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు ఉన్నతమైన విద్యతో పాటు ఆరోగ్యంగా ఉండడం కోసం పౌష్టికాహారం అందించాలి అనే సదుద్దేశ్యంతో ముఖ్యమంత్రి కేసిఆర్ అల్పాహారం పథకం ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే వివేకానంద్ పేర్కొన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బహాదూర్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన అల్పాహారం పథకం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కమీషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పమిలాసత్పతి, జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్‌లతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం కేసిఆర్ ప్రవేశపెట్టిన ఈపథకంతో ఎంతోమంది పేదపిల్లలకు మంచి పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్యవంతమైన భవితవ్యానికి నాంది పలికారని పేర్కొన్నారు. ఈతరం పిల్లలు సిఎం కేసిఆర్ స్ఫూర్తితో పయనించి జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పిల్లలకు అల్పాహారాన్ని స్వయంగా వడ్డించి వారితో కలిసి అల్పాహారాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కమీషనర్ సత్యనారాయణరావు, తహసీల్దార్ సుచరిత, వైస్‌చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్ సత్యనారాయణ, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బడి పిల్లలకు ఉపాహారంను ఏకైక రాష్ట్రం తెలంగాణ

**నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ రేఖ యాదగిరి**


గండిపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉపాహారంను పంపిణీ చేస్తున్న నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ రేఖ యాదగిరి, కమిషనర్ సురేందర్‌రెడ్డిలు

నార్సింగి, అక్టోబర్ 6 ప్రభాతవార్త : సీఎం కేసీఆర్ చొరవతో దేశంలో బడి పిల్లలకు బలవర్ధకమైన ఉపాహారంను అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలం గాణ అని నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ దారుగుపల్లి రేఖ యాదగిరి పేర్కొన్నారు. శుక్రవారం గండిపేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాహారం పతకంను కమీషనర్ సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకటేష్ యాదవ్, కౌన్సిలర్లతో కలిసి రేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా రేఖ, సురేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ ఈ పతకం ప్రారంభంతో ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్లు పూర్తిగా తగ్గిపోతాయన్నారు. ప్రభుత్వ బడుల్లో రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదల బిడ్డలే చదువుతున్నారని, వారికి ఈ పతకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉదయం లేచి శుభ్రంగా స్నానం చేసి పాఠశాలకు రాగానే ఉదయం ఉపాహారం, మధ్యాహ్నం భోజనం అందిస్తూ నిష్ణాతులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వంపై అదనపు భారం పడుతున్నా భావి పౌరుల బంగారు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సీఎం కేసీఆర్ ఈ మంచి పతకంను అమలు చేస్తున్నారని తెలిపారు. చిరు ధాన్యాలతో కూడా ఉపాహారంను అందించడం చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జి.శివారెడ్డి, అరుణజ్యోతి, యాదమ్మ, సునీత గోపాల్, విజేత ప్రశాంత్ యాదవ్ పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 56వ రోజు కొనసాగుతున్న పాదయాత్ర


కేంద్ర ప్రభుత్వ పథకాలను గడప గడప వివరిస్తున్న బీజెపి శ్రేణులు

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 06, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో 56వ రోజు ఫతేనగర్ డివిజన్ పైపులైన్ రోడ్‌లోని దుర్గామాత ఆలయం నుండి ఇంటింటికి బీజెపి భరోసా యాత్రను బీజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో బీజెపి సీనియర్ నాయకులు మాజీ కార్పోరేటర్ కృష్ణగౌడ్ ప్రారంభి, గడప గడపకు తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కేంద్రంలో మరోసారి నరేంద్ర మోడీ పాలనకు అవకాశం ఇవ్వాలని స్థానిక ప్రజలను కోరారు. స్థానికంగా ఎదురొ్కంటున్న సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తామని తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు బీజెపి పార్టీ గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఉదయ్ కుమార్, రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యులు బి.రామ్మోహన్, సతీష్‌గౌడ్, జిల్లా యువమోర్చ నాయకులు హరిప్రసాద్, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ బానేశ్ యాదగిరి, నరేష్, రమేష్, శ్రీనివాసరెడ్డి, రేవప్ప, రవి, నాగేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై బలవన్మరణం

బేగంపేట అక్టోబరు 6,ప్రభాతవార్త : మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఇంట్లోని కూరగాయల కత్తితో పొడుచుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.పోలీసుల కథనం మేరకు.. మయూరి మార్గ్ బేగంపేట లో నివసించే యాదగిరి దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో మనీషా(24)ప్రైవేటు ఉద్యోగి.తేజోమై(22),వెన్నెల(18)లు ఉన్నారు.యాదగిరికి 20సంవత్సరాల క్రితం షుగర్ వచ్చింది. దీంతో పాటు అతనికి మూర్ఛ(ఫిట్స్)కూడా బాధపడుతున్నాడు.మందులు వాడుతున్నాడు.మద్యానికి బానిసయ్యాడు.దీంతో కొన్ని రోజులుగా వైద్యం చేయించేకోలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నెల 4వ తేదీ పెద్ద కుమార్తె మనీషాకు ఫోన్ చేసి త్వరగా ఇంటికి రమ్మని చెప్పిందన్నారు. ఇంటికి వచ్చే సరికి తన తండ్రి మద్యం మత్తులో ఉన్నాడని తెల్సుకుంది.అప్పటికే అతనికి రక్త స్రావం కావడంతో 108 అంబులెన్స్‌కు కాల్ చేసి నిమ్స్ ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించారు.అంబులెన్స్‌లో తరలిస్తుండగా తీవ్ర రక్త స్రావం కారణంగా యాదగిరి మృతి చెందినట్లు ప్రకటించారు. మృతుని పెద్ద కుమార్తె బొడ్డు మనీషా పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జయచందర్ తెలియజేసారు.

## దళిత బంధులో మాలలకు న్యాయం చేయాలి


ధర్నా చేస్తున్న మాలలు

సైఫాబాద్, అక్టోబరు 6 ప్రభాతవార్త: దళిత బంధు పథకంలో మాలలకు తీవ్రంగా అన్యాయం జరుగుతున్నదని, రాష్ట్ర ప్రభుత్వం రెండోవ విడతలో న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న అనేక మంది మాలలను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జెఏసి ఆధ్వర్యంలో అనేక మంది మాలలు తొలుత తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జెఎసి ఛైర్మన్ చెరుకు రాంచందర్, వైస్-ఛైర్మన్ టి.అనిల్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో మాల సామాజిక రంగానికి చెందినవారు అన్ని రంగాలలో ముఖ్యంగా విద్యా, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేసిన తొలి విడత దళిత బంధు పథకంలో మాలలకు తీవ్రంగా అన్యాయం జరిగిందని, 119 నియోజక వర్గాలలో ఒక్కొక్క నియోజకవర్గానికి వంద యూనిట్లు అమలు చేస్తే మాలలకు 10 యూనిట్లు కూడా దక్కని దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో జెఏసి నాయకులు తాళ్ళపల్లి రవి, వినోద్, కనకరాజు, గడ్డం సత్యనారాయణ, ఎ.నవీన్, మల్లేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అశోకానగర్‌లో 91 లక్షలతో అభివృద్ధి పనులు


మంచినీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

హైదరాబాద్, అక్టోబరు 6 ప్రభాతవార్త: గోల్నాక డివిజన్ అశోకానగర్‌లో 5.50 లక్షలతో మంచి నీటిపైప్‌లైన్, 5.60 లక్షలతో డ్రైనేజీ పైప్‌లైన్ పనులతోపాటుగా 80 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా వేయనున్న సిసి రోడ్డు పనులకు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, స్థానిక కార్పోరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అశోకానగర్‌లో ఒక్కరోజులోనే 91 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు.సిఎం కెసిఆర్ నాయకత్వంలో బిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత గతంలో ఎన్నడూ చూడనివిధంగా అత్యధిక నిధులతో అంబర్‌పేట నియోజక వర్గంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తూ సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు పోతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, బిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, దామోదర్, ఫని, శ్యామ్, శంకర్, సంతోష్, వెంకట్, సర్ధార్, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు. **బాలప్పబాడలో 28 లక్షలతో మంచినీటి, డ్రైనేజీ పైప్ నిర్మాణం..** కాచిగూడ డివిజన్‌లోని బాలప్పబాడలో 20 లక్షల రూపాయల నిధులతో నిర్మించనున్న మంచినీటి పైప్‌లైన్, 8 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్‌కు శుక్రవారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, స్థానిక కార్పోరేటర్ ఉమారమేష్‌యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అలాగే వీరన్నగుట్టలో 15 లక్షల రూపాయలతో నిర్మించిన షెడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజలతోపాటు సంబంధిత అధికారులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తప్పిపోయిన బాలుడిని చేరదీసి తల్లిదండ్రులకు అప్పగించిన కార్మికులు

**కార్మికులను అభినందించిన కమిషనర్**


తప్పిపోయిన బాలుడిని చేరదీసి తల్లిదండ్రులకు అప్పగిస్తుననన మణికొండ మున్సిపల్ కమీషనర్ ఫల్గుణ్ కుమార్, మేనేజర్ రమేష్

నార్సింగి, అక్టోబర్ 6 ప్రభాతవార్త : తల్లిదండ్రుల నుంచి తప్పిపోయి రోడ్డుపై ఏడుస్తూ కూర్చున్న ఐదేళ్ల బాలుడిని మణికొండ మున్సిపల్ శానిటేషన్ కార్మికులు చేరదీశారు. తల్లిదండ్రుల ఆచూకిపై ఆరా తీశారు. బాలుడు సరైన వివరాలు తెలుపకపోవడంతో మున్సిపల్ కార్యాలయానికి తీసుకువచ్చి కమీషనర్ ఫల్గుణ్ కుమార్, మేనేజర్ రమేష్‌లకు అప్పగించారు. బాలుడికి భోజనం పెట్టారు. ఎలాగైనా బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చాలని అధికారులు తాపత్రయపడ్డారు. మానసిక స్థితి సరిగ్గా లేక పోవడంతో బాలుడిని ఎంత అడిగినా తల్లిదండ్రుల వివరాలు చెప్పలేకపోయాడు. ఏడుపు అందుకోవడంతో అధికారులు ఫోన్‌ను బాలుడి చేతికిచ్చారు. వెంటనే ఆ బాలుడు తన తండ్రి మొబైల్ నెంబర్‌ను డయల్ చేశాడు. దీంతో అధికారులు బాలుడి తండ్రితో మాట్లాడి, మున్సిపల్ కార్యాలయానికి పిలిపించారు. తల్లిదండ్రులను చూడగానే బాలుడు వెంటనే వారి చెంతకు చేరి హత్తుకున్నాడు. నా కుమారుడిని క్షేమంగా నాకు అప్పగించిన మున్సిపల్ కమీషనర్, మేనేజర్, కార్మికులకు జీవితాంతం రుణపడి ఉంటానని బాలుడి తండ్రి కన్నీళ్ల పర్యాంతమయ్యాడు. రోడ్డుపై ఏడుస్తున్న బాలుడిని చూసి మనకెందుకులే అని వదిలేయకుండా బాలుడిని మున్సిపల్ కార్యాలయంకు తీసుకు వచ్చి ఇంకా మానవత్వం మిగిలే ఉందని కార్మికులు నిరూపించుకున్నారు. కార్మికుల స్పందన పట్ల అధికారులు, పుర ప్రముఖులు, ప్రజలు అందరూ అభినందిస్తున్నారు.

## 8 నుంచి 10వరకు సిటిజన్ యూత్ పార్లమెంట్

**హాజరుకానున్న మాజీ ఉపరాష్ట్ర పతి వెంకయ్యనాయుడు, గవర్నర్ తమిళి సై**

తార్నాక, అక్టోబర్ 6 ప్రభాతవార్త: తెలంగాణ యువత కోసం ఈ నెల 8 నుంచి 10వతేది వరకు ఓ.యూలో సిటిజన్ పార్లమెంట్ జరుగనఉంది. ఓ.యూ, సిటిజన్ ఇండియా సంయుక్తగా నిర్వమిస్తున్న ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్ర పతి వెంకయ్యనాయుడు ప్రారంబిస్తారని సిటిజన్ ఇండియా సీఈఓ స్వాతి చంద్రశేఖర్ స్పష్టం చేశారు. పలువురు పార్లమెంటేరియన్లు, చట్ట సభల నిర్వాహణలో అనుభవం కల్గిన ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు 1800 వందల మంది దరఖాస్తు చేసుకున్నారని అందులో నుంచి 180 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత పటిష్టం చేసే ఉద్దేశంతో 18 ఏళ్ల నుంచి 40ఏళ్ల మధ్యవయస్సు ఉన్న వారు యూత్ పార్లమెంట్‌లో పాల్గొనే అవకాశం కల్పించినట్లు చెప్పారు. మొదటి రెండు రోజులు జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవవనరుల కేంద్రంలో మూడో రోజు ఓ.యూ దూరవిద్యాకేంద్రం ఆడిటోరియంలో యూత్ పార్లమెంట్ పలు అంశాలపై చర్చించనుంద న్నారు. చట్ట సభల్లో ఉండే నిబంధనలు, నియమాలు పూర్తిగా ఇక్కడ పాటిస్తూ యువతకు అవగాహణ కల్పిస్తామని చెప్పారు. వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్ మాట్లాడుతూ యూత్ పార్లమెంట్ లాంటి కార్యక్రమాలతో తెలంగాణ యువతలో నాయకత్వ లక్షణాలను మరింత ఉత్తేజపరిచే అవకాశం ఉంటుందన్నారు.ఎంతో మంది ఉత్తమ పార్లమెంటేరియన్లను, చట్టసభల సభ్యులను ఓ.యూ అందించిందన్నారు.

ఈ కార్యక్రమంతో విద్యార్థులకు చట్టసభల నియమ, నిబందనలపై అవగా హన ఏర్పడుతుందన్నారు. యువతలో సృజనాత్మక శక్తి, రాజకీయ నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరాం వెంకటేశ్ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఫార్మాస్యూటికల్ పరిశ్రమల్లో పర్యావరణ సమస్యలపై దృష్టి

**సిఎస్ఐఆర్-నీరి డైరెక్టర్ డాక్టర్ ఏ.ఎన్ వైద్య**


సదస్సుకు హాజరైన ప్రతినిధులతో డాక్టర్ ఏ.ఎన్.వైద, డాక్టర్ షేక్‌బాషా, వెంకటరమణ తదితరులు

హైదరాబాద్, అక్టోబరు 6,ప్రభాతవార్త: ఫార్మాస్యూటి కల్ పరిశ్రమల్లో పర్యా వరణ సమస్యలపై దృష్టిసారించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని నేషనల్ ఎన్విరాల్‌మెంట్ రీసర్చ్ ఇనిస్టిట్యూట్ -నీరి (సిఎస్ఐఆర్)డైరెక్టర్ డాక్టర్ ఏ.ఎన్ వైద్య అన్నారు. ఈమేరకు శుక్రవారం సిఎస్ఐఆర్ నీరి, హైదరాబాద్ జోనల్ సెంటర్ ఆధ్వర్యంలో "ఫార్మాస్యూటికల్ పరిశ్రమలో పర్యావరణ సవాళ్లు " అనే అంశంపై బేగంపేట్ హరిత ప్లాజాలో ఏర్పాటు చేసిన ఒక్కరోజు వర్క్‌షాపుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాటాడుతూ ఫార్మాస్యూటికల్ పరిశ్రమలో పర్యా వరణ సమస్యలపై దృష్టి సారించడమే ఈవర్క్‌షాప్ ప్రధాన లక్ష్యం అన్నారు. సుసిమైన పర్యావరణ నిర్వాహణ పద్దతులను వివరించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ముఖ్యంగా గాలి నాణ్యత, వాసన నిర్వాహణ, మురుగునీటి శుద్ధి ,పునర్వినియోగం, ఘన ప్రమాదకర వ్యర్థాల నిర్వాహణ వంటిపాటిపై చర్చిస్తున్నట్లు తెలిపారు. ఐఎస్ఐఆర్ - హైదరాబాద్ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ షేక్‌బాషా ఈవర్క్‌షాప్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించిన ఈకార్యక్రమంలో బాసర ఆర్టీయూకేటీ వైస్ ఛాన్స్‌లర్ వి.వెంకటరమణ, తెలంగాణ ఉన్నతవిద్యామండలి వైస్ చైర్మన్ శ్రీకృష్ణ ఆదిత్య శ్రీరామశెట్టి, దివీస్ మాజీ డైరెక్టర్ దివిమధుసూధన్‌రావు పాల్గొన్నారు.

### సీఎం బ్రేక్‌ఫాస్ట్‌పథకం-మరో మానవీయ సంక్షేమవరం: ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి,అక్టోబర్6 ప్రభాతవార్త : రాష్ట్రముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన బ్రేక్‌ఫాస్ట్‌పథకం మరో గొప్ప మానవీయ సంక్షేమవరప్రదాయని అంటూ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వం విప్ అరికెపూడి గాంధీ కొనియాడారు. గచ్చిబౌలి డివిజన్‌పరిధిలోని నల్లగండ్లలోని మండల ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి,యంఈఓ వెంకటయ్య, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్‌లతో కలిసి ఎమ్మెల్యే గాంధీ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గాంధీ మాట్లాడుతూ. కేసీఆర్ ఆలోచించి ఎంతో గొప్ప కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు.

### నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న స్పాపై కేసు నమోదు

బేగంపేట అక్టోబరు 6,ప్రభాతవార్త : బేగంపేట లో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఒక స్పాపైన పోలీసులు దాడులు నిర్వహించి కేసు నమోదు చేసారు.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్ కొచెర్ అపార్ట్‌మెంట్స్ సమీపంలోని ఒక ఇంట్లో అబ్జల్యూట్ ఫ్యామిలీ సెలూన్ పేరుతో నిర్వహిస్తున్న స్పా కేంద్రం నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నట్లు అందిన సమాచారం తో బేగంపేట ఎస్సై ప్రమోద్‌కుమార్ రెడ్డి సిబ్బందితో దాడి చేసారు.స్పా కేంద్రం నిర్వహణకు ఎలాంటి అనుమతి లేకపోవడం,స్పా కేంద్రం నిర్వహణలో అర్హత కలిగిన థెరపిస్టు లేకపోవడం,మసాజ్ కోసం నియమించిన యువతులు తరచూ మారుతుండటం సీసీ కెమెరాలు లేకపోవడం అగ్నిమాపక పరికరాలు లేకపోవడం,కస్టమర్ల వివరాలు నమోదు చేయక పోవడం వంటి పలు అంశాలను పోలీసులు గుర్తించారు.స్పా నిర్వహకురాలు పి.పద్మపై కేసు నమోదు చేసారు.ఒక మొబైల్ ఫోన్ తో పాటు రూ 4800లు నగదును స్వాధీనం చేసుకున్నారు.

### ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యం

ధర్నాచౌక్, అక్టోబర్ 6, ప్రభాతవార్త: ముషీరాబాద్ నియోజక వర్గంలో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన కవాడిగూడ కార్పోరేటర్ రచనశ్రీతో కలసి కవాడిగూడ డివిజన్‌లో 80 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేసి ప్రారంభిం చారు. ఎల్చిగూడ, జల్వాయు టవర్స్ లైన్, పూల్‌బాగ్, దేవి ప్రసాద్ బాగ్, ఉందా బాగ్‌లో దాదాపు 30 లక్షలతో పైప్ లైన్ పనులను వారు ప్రారంభించారు. అనంతరం 50 లక్షల వ్యయంతో ఇందిరాపార్కు వద్ద స్కేటింగ్ ట్రాక్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముషీరాబాద్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటు లో ఉంటూ వారి సమస్యలు అడిగి తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నామన్నారు.

### కొత్త ఓటర్ లిస్ట్‌లో చార్మినార్ నియోజకవర్గం బిజెపి కన్వీనర్ పేరు గల్లంతు

చార్మినార్, అక్టోబరు 6 ప్రభాతవార్త : కొత్తగా విడుదలైన ఓటర్ లిస్ట్‌లో హైదరాబాద్ పాతబస్తీ చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గం బిజెపి కన్వీనర్ కె.సురేందర్ పేరు గల్లంతు అయ్యింది.చార్మినార్ నియోజకవర్గం బిజెపి కన్వీనర్‌గా కొనసాగుతున్న కె.సురేందర్ పాతబస్తీలోని 20-2-676/1 నెంబరు గల ఇంటిలో నివాసం ఉంటున్నారు.సురేందర్ మూడు సంవత్సరాలు క్రితం జరిగిన జిహెచ్ఎంసి ఎన్నికల్లో పురానాపూల్ డివిజన్ నుంచి బిజెపి తరుపున కార్పొరేటర్‌గా పోటీ చేశారు.కాగా గురువారం కొత్తగా విడుదలైన ఓటర్ లిస్ట్‌లో సురేందర్ పేరు డిలీట్ చేసి ఉంది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘాన్సీ బజార్ డివిజన్‌లో అనేక మంది పేర్లను ఓటర్ లిస్ట్ నుంచి తొలగించారని,కార్పొరేటర్‌గా పోటీ చేసిన సమయంలో ఓటర్ లిస్ట్‌లో తన పేరు ఉందని,కొత్తగా విడుదల చేసిన ఓటర్ లిస్ట్‌లో తన పేరును తొలగించటం విడ్డూరంగా ఉందని, వెంటనే అధికారులు స్పందించి తొలగించిన పేర్లను తిరిగి ఓటర్ లిస్ట్‌లో చేర్చాలని కోరారు.

### బీజెపి రాష్ట్ర కార్యవర్గ ప్రత్యేక ఆహ్వానితులుగా లంగటి నరేందర్‌రెడ్డి

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 6, ప్రభాతవార్త : బిజెపి రాష్ట్ర కార్యవర్గ ప్రత్యేక ఆహ్వానితులుగా శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన లంగటి నరేందర్‌రెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం ఘట్కేసర్‌లో జరిగిన బిజెపి రాష్ట్ర స్థాయి సమావేశంలో బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా నియమించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బీజెపి ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించినందుకు జాతీయ అధ్యక్షులు నడ్డాకు, బీజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

### ఎర్రగడ్డ డివిజన్‌లో బతుకమ్మ సంబరాలు


మహిళలకు బహుమతులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోపినాథ్

ఫిల్మ్‌నగర్, అక్టోబర్ 6, ప్రభాతవార్త : జూబ్లీహిల్స్ శాసనసభ్యులు, భారాస హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపినాథ్ ఆధ్వర్యంలో ఎర్రగడ్డ డివిజన్‌లో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సంబరాలలో మహిళలు సుమారుగా మూడువేల మంది పాల్గొన్నారు. మహిళలకు ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంజీవ్, జనరల్ సెక్రటరీ ఎమ్.డి షరీఫ్ ఖ్వారీషి, గంటా మల్లేష్, యాదగిరి, శ్రావణ్ పటేల్, దాసి శ్రీకాంత్, అజీమ్, రసూల్, బాలకృష్ణ, శ్రీకాంత్‌గౌడ్, రవి, రమణ, రఘువీర్, అఫ్సర్, ఇస్మాయిల్‌ఖాన్, ధరసింగ్, సబ్‌సింగ్, నర్సింహా, కళ్యాణి, ఉష, సుజాత, ప్రవీణ, బాలామణి, యక్కమ్మ, లక్ష్మి, రాజయ్య, జులేఖ, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ నిరుపేద విద్యార్థులకు ఉచిత వసతి


శ్రీలక్ష్మీ వెంకటేశ్వర పొలాప్రగడ చారిటబుల్ మేనేజింగ్ ట్రస్టీ సమావేశంలో పాల్గొన్న చిరంజీవిరావు, రాంచంద్రరావు, శ్రీనివాస్, పివికె ప్రసాద్‌లు

హైదరాబాద్,అక్టోబరు 6 ప్రభాతవార్త: గ్రామీణ నిరుపేద విద్యార్థులకు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర పోలాప్రగడ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా వసతి కల్పించనున్నట్లు సంస్థ మేనేజింగ్ కమిటీ ప్రకటించింది. ఈ మేరకు నల్లకుంట ఎస్ఎల్ డయాగ్నస్టిక్ సెంటర్‌లోని సంస్థ కార్యాలయంలో సంస్థ ట్రస్టీలు చిరంజీవిరావు, రాంచంద్రరావు, శ్రీనివాస్, పివికె ప్రసాద్ రామకృష్ణలు మాట్లాడుతూ చదువుకోవాలనే పట్టుదల ఉన్న గ్రామీణ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వసతి గృహంలో నివాసం, భోజనం ఏర్పాటుతో పాటు బస్‌పాస్ తదితర సౌకర్యాలను సమకూరుస్తున్నామన్నారు.ప్రొఫెసనల్ కోర్సులు, గ్రాడ్యుయేషన్ కోర్సులు అభ్యసిస్తున్న వారికి అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. తల్లి లేక తండ్రిని కోల్పోయిన నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. అమీనాపూర్, సన్‌సిటీ, మేడిపల్లి, ఘట్‌కేసర్, సుచిత్ర, దమ్మాయిగూడ ప్రాంతాల్లో వసతి గృహాలు ఉన్నట్లు పేర్కొన్నారు. వసతి గృహాల్లో ఉచిత అడ్మిషన్ల కోసం ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 8వ తేదీలోగా నల్లకుంట, శంకరమఠం మార్కెట్, ఎల్ఎల్ డయాగ్నస్టిక్ సెంటర్‌లో సంప్రదించాలని కోరారు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
నిట్ సం.38/EE-6/CRZ/GHMC/2023-24, తేది: 05.10.2023, పని స్వభావం: CC రోడ్లు, డ్రైన్ నవీకరణ మరియు పెయింటింగ్ పనులు. అంచనా ధర (రూ.లక్షలలో): 230.48. బిడ్స్ స్వీకరణ ప్రారంభ/చివరి తేదీలు సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 06.10.2023 సా.04.00 గం. బిడ్స్ స్వీకరణ చివరి తేది: 09.10.2023 సా.04.00 గం. అధికారి పేరు, చిరునామా, సెల్ సం: శ్రీ M. షేర్‌సింగ్, EE డివిజన్-6, CRZ, GHMC, హైదరాబాద్ ఫోన్ నం.9154960551. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.tender.eprocurement.gov.in పై చూడవచ్చును. గమనిక: టెండర్ ప్రకటన తేదీ తర్వాత మాత్రమే 1% ఐయానాను పొందగలరు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ నం.6, చార్మినార్ జోన్, హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
DIPR.No.7809-PP/CL/Advt/1/2023-24, తేది: 06.10.2023

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సంతోష్‌నగర్ సర్కిల్-7,చార్మినార్ జోన్
GHMC
'ఇ'ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన నిర్వహణ పనులు
నిట్ నెం: 23/EE-7(4B)/CRZ/GHMC/2023-24. పనిపేరు: క్ర.సం.1 నుండి 6. అంచనా ధర (రూ.లక్షలలో) రూ.156.78 లక్షలు. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 07.10.2023 సా.4.00గం. వద్ద. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ: 16.10.2023 సా.04.00గం. వద్ద. అధికారి పేరు, చిరునామా, సెల్ నెం. శ్రీ జి.ఏకాంబరం EE(FAC) సంతోష్‌నగర్, హైదరాబాద్. ఫోన్ నం.7673951166. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సంతోష్‌నగర్ సర్కిల్-7, చార్మినార్ జోన్, GHMC.
DIPR.No.7892-PP/CL/Advt/1/2023-24 తేదీ: 06.10.2023

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
పటాన్‌చెరు & రామచంద్రాపురం సర్కిల్-22, శేరిలింగంపల్లి జోన్
GHMC
సంక్షిప్త టెండరు ప్రకటన సం. 18/GHMC/PTC-C-22/2023-24, తేది:05.10.2023. నిట్ సం. పైన పేర్కొనబడి. పనిపేరు: 7 సం.ల నిర్మాణ పనులు. అంచనా మొత్తం/ECV: రూ. 265.00 లక్షలు. డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 07.10.2023 ఉ.10.30గం. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ, సమయం: 10.10.2023 మ.1.00గం. EE పేరు, చిరునామా: EE, పటాన్‌చెరు, సర్కిల్-22, ఫోన్ నం. 7995007417. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-22, Slp జోన్, GHMC.
DIPR.No.7901-PP/CL/Advt/1/2023-24 తేదీ: 06.10.2023

## అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు : ఎమ్మెల్యే బేతి, కార్పోరేటర్ శాంతి శేఖర్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భేతి, కార్పోరేటర్ శాంతి శేఖర్

**నాచారం, అక్టోబర్ 6 ప్రభాతవార్త:** నాచారం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం అభివృద్ధి పనులకు శుక్రవారం ఉమ్మేల్యే భేతి సుభాష్ రెడ్డి, కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్‌తో కలిసి శంకుస్థాపనలు చేశారు. రూ. 94లక్షల వ్యయంతోఅంబేద్కర్ విగ్రహం నుంచి భవానినగర్‌కు వెళ్లే మార్గం లో ఉన్న నాలాపై బ్రిడ్జి నిర్మాణం పనులకు, రూ. 33 లక్షల వ్యయంతో రాఘవేంద్రనగర్‌లోని పోచమ్మ దేవాలయం నుంచి సిల్ట్ చాంబర్ వరకు పైపులైన్ పనులకు వారు శంకుస్థాపనలు చేశారు. డివిజన్ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని వారు పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్, మేకల ముత్యం రెడ్డి, భూపాల్ రెడ్డి, అశ్వత్థామ రెడ్డి, కొరపాక అంజి, ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, విఠల్ యాదవ్, వేముల మారయ్య, కట్టబుచ్చన్న గౌడ్, రాజశేఖర్, ప్రీతి రెడ్డి, వాణి, రాజు, మంగోల్ శివకుమార్, రవీందర్ రెడ్డి, బండ శేకర్ రెడ్డి, సుగుణాకర రావు, శ్రీనివాస్, యాదగిరితో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఆటోనగర్ లారీల అడ్డా తొలగింపు : ఎమ్మెల్యే



లారీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**వనస్థలిపురం, అక్టోబరు 6 ప్రభాతవార్త:** లారీల అడ్డా విషయంలో గత 15 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న 22 కాలనీల ప్రజలకు విముక్తి కలిగిస్తూ లారీల అడ్డానీ పక్కనే ఉన్న 12 ఏకరాల ప్రబుత్వ టిఎస్ఐఐసి స్థలంలోకి మార్చి అటు ప్రజలకు, ఇటు లారీ అసోసియేషన్ వారికి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పరిష్కారం చూపారు. పట్టు వదలనీ విక్రమార్కుడిలా తన వద్దకు వచ్చిన సమస్యను పరిష్కరించడానికి అటు అధికారులతో ఇటు లారీ అసోసి యేషన్ సభ్యులతో పలుమార్లు చర్చలు జరిపి స్థలాన్ని పరిశీలించి నేడు ఆ సమస్యకి పరిష్కారం చూపి శుక్రవారం ఉదయం 5:30 ప్రాంతంలో లారీల ను ఆటోనగర్ వెనకాల ఉన్న టిఎస్ఐఐసి స్థలంలోకి తరలించారు. సమస్యను పరిష్కరించినందుకు 22కాలనీల ప్రజలు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపా రు. ఎల్బీనగర్‌ని అన్ని విధాలుగా ముందుకు తీసుకువెళుతున్న సుధీర్‌రెడ్డి నాయకత్వం మరోసారి బలపరుస్తామని చెప్పి వారికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సామ తిరుమలరెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, హయత్ నగర్ బిఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, జేఏసీ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, లక్ష్మారెడ్డి, 22 కాలనీల అధ్యక్ష కార్యవర్గ సభ్యులు, ట్రాఫిక్ ఏసిపి నవీన్‌రెడ్డి, సిఐలు ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

## మన్సురాబాద్‌లో ఫోటో ట్రేడ్ ఎక్స్‌పో



ఫోటో ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న జోగినపల్లి సంతోష్ తదితరులు

**మన్సూరాబాద్, అక్టోబరు 6 ప్రభాతవార్త:** తెలంగాణ ఫోటో, వీడియోగ్రఫర్ల సంక్షేమ సంఘం, ఫోటో టెక్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫోటో ట్రేడ్ ఎక్స్‌పోను మన్సురాబాద్ కేబీఆర్ కన్వెన్షన్ హాల్లో శుక్రవారం రాజ్యసభ సభ్యులు జోగినేపల్లి సంతోష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గీత కార్మిక సంక్షేమ శాఖ చైర్మన్ పల్లె రవికుమార్, రాష్ట్ర బి సి కమిషన్ సభ్యుడు కె.కిషోర్‌గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్, రాష్ట్ర వ్యవ స్థాపక అధ్యక్షుడు సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఫోటో టెక్ అధినేత అభిమన్యురెడ్డి, సౌత్ ఇండియా అధ్యక్షుడు పరమేష్, కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడు నగేష్, గోవా అధ్యక్షుడు ఆస్కార్, ఎపి రాష్ట్ర అధ్యక్షుడు వీరేందర్, కోశాధికారి, శైలెందర్, నాయకులు జంగారెడ్డి, నరేందర్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌తో తెలంగాణ అభివృద్ధి : అజిత్‌రెడ్డి



సమ్మేళనంలో ప్రసంగిస్తున్న అజిత్‌రెడ్డి, చిత్రంలో నవీన్ తదితరులు

**మలక్‌పేట, అక్టోబరు 6 ప్రభాతవార్త:** బిఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్తి తీగ అజిత్‌రెడ్డి పేర్కొనానరు. నవీన్‌యాదవ్‌ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడుతూ దళితబంధు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రైతు బంధు లాంటి ఎన్నో పథకాలను అమలుపరుస్తున్న సిఎం కెసిఆర్ పాలన ఇతర రాష్ట్రఆలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. బిఆర్ఎస్ హ యాంలో నగరం ఎంతోఅభివృద్ధి చెందిందన్నారు. ప్రతిపక్షాల కల్లబొల్లి మాట లు నమ్మవద్దన్నారు. ఈ సమ్మేళనంలో మాజీ కార్పొరేటర్ సునరితారెడ్డి, నాయకులు చెల్లూరి రఘునందన్‌రెడ్డి, శంకర్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, రాజేశ్వర్‌రెడ్డి, పున్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భారాస మహిళా అధ్యక్షురాలుగా రంగేశ్వరి

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 6 ప్రభాతవార్త:** ఎల్‌బినగర్ నియోజకవర్గ నూతన భారాస పార్టీ మహిళా అధ్యక్షురాలుగా ఆలేటి రంగేశ్వరినాయుడు నియామక మయ్యారు. నియామక పత్రాన్ని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆమెకు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రంగేశ్వరినాయుడు మాట్లా డుతూ నాపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. భారాస పార్టీ చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్ళి పార్టీ ప్రతిష్ఠతలు పెంపొందిస్తామని తెలిపారు.

## అనారోగ్యంతో చనిపోయిన వ్యక్తి కుటుంబానికి ఆర్థిక సహాయం : కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి

**నేరెడ్‌మెట్, అక్టోబర్ 6 ప్రభాతవార్త :** నేరెడ్‌మెట్ పరిధిలోని జెజెనగర్‌కు చెంది న షణ్ముగం శుక్రవారం మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మల్కాజి గిరి సరి క్లల్ బి.ఆర్.ఎస్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగిందన్నారు. సర్కిల్ పరిధిలో నిరుపేదలకు తనవంతు ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శివ, సుబ్బరాయుడు, మాధవ రెడ్డి, నవీన్, కిశోర్, కాశీం తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వంలో మహిళా సాధికారత : మర్రి రాజశేఖర్‌రెడ్డి



**మల్కాజిగిరి, అక్టోబరు 6 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వంలో మహిళా సాధికార తను సాధిస్తున్నారని మల్కాజిగిరి బిఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జ్ మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం గౌతమ్‌నగర్ డివిజన్ పరిధిలోని లక్ష్మి సాయి గార్డెన్‌లో మల్కాజిగిరి కళంజియా సమైఖ్య మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజశేఖర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ సమాఖ్య గ్రూపులవల్ల కుటుంబాలు ఆర్థికంగా,సామాజికంగా అభివృద్ధి చెందు తున్నాయని రాష్ట్ర ప్రభుత్వం కూడా మహిళల కోసం అనేక సంక్షేమ పథకాల ను ప్రవేశపెట్టిందని మహిళా బిల్లు కోసం కూడా మద్దతును ప్రకటించడం జరిగిందన్నారు. మహిళలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, మహిళాశిశు సంక్షే మానికి పౌష్టికాహార కిట్లను గర్భిణీలకు బాలింతలకు అంగన్వాడీల ద్వారా పౌష్టిక ఆహారాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. హాస్పిటల్‌కి వెళ్లడానికి ప్రతి సోమవారం మల్కాజిగిరి నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, నాయకులు మేకల రాముయాదవ్, కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి, వేణు నాయుడు, రామచందర్, సత్యనారాయణ, సిద్ధిరాములు, నర్సింగ్, అనిల్ వేలాది మంది మహిళలు పాల్గొన్నారు.

## విద్యార్థులు తమనైపుణ్యాన్ని సమాజాభివృద్ధికి వినియోగించాలి

**హయత్‌నగర్, అక్టోబరు 6 ప్రభాతవార్త:** విద్యార్థులు తమ నైపుణ్యాన్ని సమా జాభివృద్ధికి వినియోగించాలని, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సృజ నాత్మక ఆలోచనలతో ముందుకు సాగాలని జేఎన్‌టీయూ డైరెక్టర్, ప్రొఫెసర్ కె.ఎం.లక్ష్మణరావు, పల్లవి ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ మల్కా కొమరయ్య అన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కుంట్లూర్ గ్రామంలోని కళాశాలలో శుక్రవారం స్నాతకోత్సవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ... నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో ప్రతిభను చూపాలని, విజ్ఞానాన్ని పెంపొందించుకుని దేశం గర్వపడేలా ఉన్నత స్థానాలకు చేరాలని సూచించారు. అనంతరం గ్రాడ్యుయే షన్ పూర్తిచేసుకున్న విద్యార్థులను అభినందించారు. తమ కళాశాలలోని ఇంజనీరింగ్ విభాగంలో 93 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఛైర్మన్ వివరించారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు స్వర్ణ, రజత పతకా లు, ధృవపత్రాలను అందించారు. కార్యక్రమంలో రమేష్‌జంపుల, ఎగ్జిక్యూ టివ్ డైరెక్టర్ డా.మల్కానవీన్, డైరెక్టర్ డా.జె.గోవర్ధన్, సుమేధారమేష్, ప్రిన్సిపల్ డా.ఎం.వి.రాజు, కన్వీనర్ ప్రియంవద, అంబాల శ్రీధర్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## తట్టి అన్నారంలో బతుకమ్మ చీరల పంపిణీ



బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న కమిషనర్, కౌన్సిలర్లు

**హయత్‌నగర్, అక్టోబరు 6 ప్రభాతవార్త:** పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ తట్టి అన్నారం గ్రామంలోని వార్డు కార్యాలయంతో పాటు మర్పల్లిలో శుక్రవారం తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో సమకూర్చిన బతుకమ్మ చీరలను కమిష నర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు దేవడిగీత వేణుగోపాల్‌రెడ్డి, పాశంఅర్చన దామోదర్‌లు మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పరశు రాంనాయక్, రోహిణిబ్రహ్మానందరెడ్డి, ఆర్.ఐ.హరికుమార్, శ్రావణ్‌కుమార్, రామేశ్వరి పాల్గొన్నారు.

## సరూర్‌నగర్‌లో కార్పొరేటర్ మార్నింగ్ వాక్



మార్నింగ్‌వాక్ చేస్తున్న శ్రీవాణిఅంజన్‌కుమార్

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 6 ప్రభాతవార్త:** పౌర సమస్యలను తెలుసుకొని వాటిని సకాలంలో పరిష్కరించడానికి మార్నింగ్‌వాక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామ ని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ పేర్కొన్నా రు. లక్ష్మీనగర్ కాలనీలతో కలిసి శుక్రవారం కార్పొరేటర్ మార్నింగ్‌వాక్ నిర్వ హించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రతపై అవగాహ న, స్వచ్ఛభారత్ అభియాన్ ఒక ఉద్యమంగా మన దేశాన్ని పరిశుభ్రంగా, మెరుగ్గా ఆరోగ్యంగా మార్చడానికి అట్టడుగు స్థాయిలో పరిశుభ్రతను పెంపొం దించేలా వ్యక్తిగత ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధానకార్యదర్శి మందుల శ్రీధర్‌యాదవ్, మహేష్‌యాదవ్, రామకృష్ణ పాల్గొన్నారు.

## రూ.36లక్షలతో ముదిరాజ్ స్మశానవాటిక అభివృద్ధి



కార్పొరేటర్ రజితరెడ్డిని సత్కరిస్తున్న ఉప్పల్ ముదిరాజ్ సంఘం నేతలు

**ఉప్పల్, అక్టోబరు 6 ప్రభాతవార్త :** ఉప్పల్ ముదిరాజ్ స్మశానవాటిక అభివృద్ధికి రూ.36లక్షలు మంజూరు చేసినట్లు కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ వార్డు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు ముదిరాజ్ సంఘ నేతలు ఆమెను ఘనంగా సత్కరించారు. అనం తరం ఆమె మాట్లాడుతూ ఉప్పల్ ముదిరాజ్ స్మశానవాటినను ఆధునీకరించి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేం దుకు తగు చర్యలు తీసుకుంటున్న ట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ముదిరాజ్ సంఘం నేతలు మహం కాళి నరసింహ, బోరంపేట కృష్ణ, ఈగ శంకర్, ఆర్.వెంకటేష్, ఈగ అంజ య్య, ఈగ సంతోష్, మహంకాళి కృష్ణ, ఈగ దాస్, దానయ్య, లక్ష్మీనారా యణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా నేతల ప్రచారం

**ఉప్పల్, అక్టోబరు 6 ప్రభాతవార్త :** పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు పథకాలపై ప్రచారం ఉధృతం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా రామంతాపూర్,హబ్సిగూడ ప్రధాన రహదారుల వెంట ప్రచారం నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ నేతలు సుధాకర్‌చారి, రాజ మోహన్‌రెడ్డి, సుధాకర్‌శెట్టి, పి.నరసింహారెడ్డి,మోహన్, సాయిగౌడ్, కీసర రామకృష్ణారెడ్డి, మహేష్, సుజాత తదితరులు మాట్లాడుతూ ఉప్పల్ నియోకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామన్నారు.

## పాఠశాల విద్యార్థులకు అల్పాహారం : బేతి



అల్పాహారం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ గీత తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 6 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అల్పాహారం కార్యక్రమాన్ని శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రారంభించారు. చిలుకానగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి అల్పాహారం రుచి చూశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సిఎం కెసిఆర్ పేద విద్యార్థుల కోసం మానవీయ కోణంలో ఆలోచించి విద్యా ర్థులకు అల్పాహారం అందజేస్తున్నారని, విద్యార్థుల కడుపు నింపేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం కార్యక్రమం నేటి నుంచి ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బినగర్ జోనల్ కమిషనర్ పంకజ, డిసి శ్రీనివాస్, తహసీల్దార్ వెంకటనరసింహారెడ్డి, ఎంఈఓ శశిధర్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆదినారాయణ, పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ఆదరించండి.. అభివృద్ది చేసి చూపిస్తా : బండారి లక్ష్మారెడ్డి



బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 6 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ జెండా ఎగురవేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం కెసిఆర్ గార్డెన్‌లో ఉప్పల్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించా రు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రెండు నెలలు కష్టపడి పని చేయాలని, ఐదేళ్లు మీ కోసం నేను పనిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆఫీసులలో ఏ పని ఉన్నా బిఆర్ఎస్ కార్యకర్తలు ఎటువంటి ఇబ్బం ది లేకుండా పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఉప్పల్‌కు వందపడకల ఆసుపత్రి తెచ్చిన ఘనత తనకే దక్కుతుందన్నారు. జూనియర్, డిగ్రీ కళాశాల భవనాలు కూడా నిర్మిస్తానని తెలిపారు. ప్రభుత్వ పథకాలు కూడా అన్ని వర్గాలకు అందే విధంగా కృషి చేస్తానన్నారు. ప్రజల కోసం పనిచేసే వారిని గెలిపించాలని సూచించారు. ఈ సందర్భంగా మాజీ ఎంబిసి చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేతలు అరటికాయల భాస్కర్, ఆకుల మహేందర్, పోగుల దయాకర్‌రెడ్డి, సల్ల వీరారెడ్డి, మేకల మధుసూధన్‌రెడ్డి,పిల్లి నాగరాజు,అన్య బాలకృష్ణ, సుక్క కిరణ్, టంటం వీరేష్, మోహన్‌రెడ్డి, కె.హనుమంతు, జి.పాపిరెడ్డి, పంగ రాజేశ్వర్‌రెడ్డి, నిరంజన్‌చారి, రాజు లింగాయత్, నర్సిరెడ్డి,బింగి భరత్‌గౌడ్,మహిళా నేతలు రాణిరెడ్డి, అనిత వివిద అనుబంధ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## ఆటల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలి



విద్యార్థులకు ఆట వస్తువులు అందజేస్తున్న చింతల అరుణ

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 6 ప్రభాతవార్త:** విద్యార్థులు చదువుతోపాటు ఆటల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణసురేంద్రనాథ్‌యాదవ్ పేర్కొన్నారు. నాగోల్ ప్రబుత్వ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఆమె క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పిల్లలు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఎదిగేందుకు పాటలు ఉపయోగపడతాయని అన్నారు. పిల్లలని ఆటలకు దూ రంగా ఉంచడమంటే వారిని బాల్యం నుంచి దూరంగా ఉంచడమే అన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్‌క్లబ్ వెంకట్‌రెడ్డి, అనిల్ నాయకులు ప్రభాకర్‌గౌడ్, శివకుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఐఎస్ సదన్‌లో బతుకమ్మ చీరల పంపిణీ



బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న సామ స్వప్న సుందర్‌రెడ్డి

**సైదాబాద్, అక్టోబరు 6 ప్రభాతవార్త:** దసరా పండుగ సందర్భంగా తెల్లరేషన్ కార్డు కలిగిన మహిళలకు ప్రభుత్వం అందజేస్తున్న బతుకమ్మ చీరలను ఐఎస్ సదన్ డివిజన్ సరస్వతినగర్‌లోని శిశుమందిర్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో యాకుత్‌పుర నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి సామ సుందర్‌రెడ్డి, ఐఎస్ సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నలు లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రూ. 60లక్షలతో పైప్‌లైన్ పనులు : రాజ్యలక్ష్మి



ఆర్.సి.సి పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి

**నేరెడ్‌మెట్, అక్టోబర్ 6 ప్రభాతవార్త:** డివిజన్ అభివృద్ధికి నిరంతరం పాటు పడతానని వినాయక్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పేర్కొ న్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని కాకతీయనగర్ లిటిల్ పియర్ల్స్ పాఠ శాల వద్ద రూ. 60లక్షల నిధులతో చేపట్టిన ఆర్.సి.సి పైప్‌లైన్ పనులను ఆమె డివిజన్ అధ్యక్షులు ఓం ప్రకాష్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ డివిజన్ ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తామన్నారు. సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక ప్రణాళి కలు చేపట్టి, కాలనీలో పర్యటించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌసుద్దీన్, ప్రభాకర్‌రెడ్డి, కుమార్, వర్క్ఇన్స్‌పెక్టర్ సాగర్, వెంకటేష్, కాంట్రాక్టర్ శ్యామ్, సాయి సురేష్, సోమనాథ్, రమేష్, నరేందర్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న శివపురి కాలనీవాసులు

**సైదాబాద్, అక్టోబరు 6 ప్రభాతవార్త:** అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని ఎల్‌బినగర్ ఎమ్మెలే య దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్‌లో రూ.6.80కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అబివృద్ధి పనులకు కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, బిఆర్ఎస్ నాయకులు గజ్జెల మదుసూధన్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అదేవిధంగా లింగోజిగూడ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో రూ.3.31 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శుక్రవారం మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస రావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డబుల్‌బెడ్‌రూం ఇండ్ల కోసం ఎవరికి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదని, పూర్తి పారదర్శకంగా లాటరీద్వారా అర్హులందరికి డబుల్‌బెడ్‌రూం ఇండ్ల కేటా యింపులు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాల్లో సుంకోజు కృష్ణమాచారి, ఒరుగంటి వెంకటేషం, డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు ముదుపు రాజిరెడ్డి, మహిళా అధ్యక్షురాలు రోజారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉమా మహేశ్వర్, ఎల్‌బినగర్ బిఆర్ఎస్ యూత్‌వింగ్ అధ్యక్షుడు రవి ముదిరాజ్, శివపురి కాలనీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సభ్యులు బెల్ద నర్సింహాగుప్తా, గోపికృష్ణ, వెంకటేష్, నాయకులు కోటగిరి శ్రీనివాస్‌గౌడ్, పగిడిమర్రి తిలక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న బిఆర్ఎస్ బిజెపిలను ఓడించాలి : జస్టిస్ చంద్రకుమార్



తెలంగాణ ప్రజల పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్ చంద్రకుమార్

**మలక్‌పేట, అక్టోబరు 6 ప్రభాత వార్త:** ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న బిఆర్ఎస్ బిజెపిలను ఓడించాలని లెంగాణ ప్రజల పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. మలక్‌పేటలోని జమున టవర్స్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్యాలయాన్ని శుక్రవారం ప్రారం భించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ యన మాట్లాడుతూ ప్రజలకోసం, సమాన న్యాయంకోసం ఏర్పాటు తెలంగాణ ప్రజల పార్టీ 2018లో ఏర్పాటు చేసామన్నారు. ఉచిత విద్య, వైద్యం, ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతామని తెలిపారు. పార్టీలు మారిన నాయకులను ఓడించాలని, హామీలపై నాయకులను నిల దీయాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికలలో ఒకటి, రెండు చోట్ల తమ పార్టీ అభ్యర్థులను తెలిపారు. బిఆర్ఎస్, బిజెపిలకు ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంంలో నాయకులు ప్రొఫెసర్ వెంకటరామయ్య, అబ్దుల్ హక్ కమర్ కృష్ణారావు, సోగరా బేగం, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : డిసి రవీందర్



కార్మికులతో మాట్లాడుతున్న డీసీ రవీందర్ తదితరులు

**హయత్‌నగర్, అక్టోబరు 6 ప్రభాతవార్త:** పారిశుద్ధ్య కార్మికులు తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హయత్‌నగర్ సర్కిల్ డీసీ రవీందర్ కుమార్ హెచ్చరించారు. కార్మికులు విధులు సక్రమంగా నిర్వహించడం లేదని కాలనీవాసుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి డీసీ ఆయా కాలనీలలో పర్యటించి పారిశుద్ధ్య పనుల ను పర్యవేక్షించారు. ఈసందర్భంగా కాలనీ రోడ్లు చెత్తతో నిండి ఉండడంతో డీసీ కార్మికుల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఎప్పటికపుడు చెత్తను తొలగించాలని లేనిపక్షంలో చర్యలు తీసుకోకతప్పదన్నారు. శానిటేషన్ జవాన్ లక్ష్మయ్య, సూపర్‌వైజర్ల విధులకు సంబంధించి పలు సూచనలు చేశారు.

## ఘనంగా వడ్డె ఓబన్న 176 వర్ధంతి



ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి తదితరులు

**తుర్కయాంజాల్, అక్టోబరు 6 ప్రభాతవార్త:** తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలో వడ్డెర వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు నర్రా పాండు ఆధ్వర్యంలో వడ్డె ఓబన్న 176వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, డిసిసిబి వైస్ చైర్మన్ కొత్త కుర్మా సత్తయ్య, వడ్డెర నాయకులతో కలిసి వడ్డె ఓబన్న చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కుంచం వెంకటకృష్ణ, పల్లపు విఘ్నేశ్‌లు మాట్లాడుతూ వడ్డె ఓబన్న స్వాతంత్య్రం పోరాటంలో గెరిల్లా యుద్ధం చేశన్నారని అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితో వడ్డెర వృత్తిదారులు ఐక్యపోరాటాల ద్వారానే వడ్డెర వృత్తిదారుల హక్కులు సాదించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు గండికోట సత్యం, బాయ్ ముత్క శ్రీనివాస్, గండికోట కృష్ణ, పల్లపు ఆంజనేయులు, పందిగొట్టి ఎల్లయ్య, వరికుప్పల రాంబాబు, నర్ర. శ్రీధర్, వేముల. మల్లేష్, బోదాసు తిరుపతయ్య, వరికుప్పల నర్సింహ్మా, వరికుప్పల వేంకటేష్, బోదాసు నగేష్, నర్ర బిక్షపతి, నర్సింహ్మా, నర్ర రాములు, గుండ్ల. రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు